Sweken IT Solutions

WE ARE HIRING !!

POWER BI SPECIALIST
DATA ANALYST

INTERESTED CANDITATES
PLEASE SEND YOUR RESUME TO
MAIL: careers@sweken.com
PH: 9100986585



VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com


# విశాఖ సమాచారమ్


విలేఖరులు కావలెను

విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం, పాలకొండ పట్టణాలకు విలేఖరులు కావలెను.

మేనేజర్
విశాఖ సమాచారమ్
సెల్: 7013785256, 9959867303



RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 136 విశాఖపట్నం, 8 మార్చి 2025 శనివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00


## ఇక విశాఖ వంతు



### మేయర్ పీఠంపై కన్నేసిన కూటమి..18 తర్వాత అవిశ్వాసానికి అవకాశం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ చేతిలో ఉన్న స్థానిక సంస్థలను ఒక్కొక్కటిగా తమ అధీనంలోకి తీసుకుంటోంది. ఇప్పటికే అనేక మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వైసీపీ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, వైస్‌చైర్మన్లు, డిప్యూటీ మేయర్లు కూటమి బాట పట్టారు. దీంతో వైసీపీ ప్రాబల్యం తగ్గిపోయి టీడీపీ చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. ఇప్పుడు మహా విశాఖ నగరపాలక సంస్థ మేయర్ పీఠం దక్కించుకోవడానికి కూటమి నాయకులు వ్యూహాలు సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత వైసీపీ చేతిలో ఉన్న కొన్ని మున్సిపాలిటీలను కూటమి నాయకులు చేజిక్కించుకున్నారు. విశాఖ మేయర్ పీఠంపై ఇన్నాళ్లు ఎలాంటి నిర్ణయం తీసుకోని కూటమి అగ్ర నాయకులు...ఇప్పుడు మేయర్ మార్పుపై దృష్టి సారించినట్లు తెలిసింది. కార్పొరేషన్ పాలకవర్గం ఏర్పడి నాలుగేళ్లు పూర్తికానుండడంతో మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి అవకాశం ఏర్పడింది. ఇదే అంశంపై ఇప్పటికే నగర ఎమ్మెల్యేలు ప్రత్యేక సమావేశం నిర్వహించి చర్చించారు. మార్చి 18 నాటికి జీవీఎంసీ పాలకవర్గం ఏర్పడి నాలుగేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో, ఆ తర్వాత మేయర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు కూటమి నాయకులు పావులు కదుపుతున్నారు. ఇప్పటికే లెక్కలు, సమీకరణాలపై దృష్టి సారించిన నాయకులు, వాటిని అమలు చేయడానికి అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీవీఎంసీ బడ్జెట్ సమావేశాన్ని ఇప్పటి వరకు నిర్వహించలేదు. ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు చేసి, బడ్జెట్ ఆమోదించిన తర్వాత... మరో కౌన్సిల్ సమావేశంలో అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టే యోచనలో ఉన్నట్లు తెలిసింది.

**మరో 8 మంది మద్దతిస్తేనే..**

కూటమి తరఫున అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే.. మరో ఎనిమిది మంది కార్పొరేటర్ల మద్దతు (మిగతా 2లో)

## దేశ చరిత్రలో తొలిసారి

### ఉమెన్స్‌డే రోజున ప్రధాని మోదీ సభకు మహిళా పోలీసుల భద్రత



**నవ్‌సారీ(గుజరాత్) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుజరాత్‌లోని నవ్‌సారీ జిల్లాలో శనివారం నిర్వహించనున్న ఉమెన్స్ డే వేడుకలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభకు మహిళా పోలీసులే భద్రత కల్పించనున్నారు.

ప్రధాని పాల్గొనే ఈ ఈవెంట్‌లో కేవలం మహిళా పోలీసు సిబ్బందితో భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు ఆ రాష్ట్ర మంత్రి హర్ష్ సంఘవి తెలిపారు. హెలిప్యాడ్ నుంచి వేదిక వరకూ ప్రధాని మోదీ భద్రతా ఏర్పాట్లను మహిళా పోలీసులు మాత్రమే నిర్వహిస్తారని వెల్లడించారు. ప్రధాని పాల్గొనే కార్యక్రమానికి కేవలం మహిళా పోలీసులే పహరా కాయడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం.ఇక ఈ కార్యక్రమానికి భద్రత కల్పించేవారిలో ఐపీఎస్ అధికారుల నుంచి కానిస్టేబుళ్ల వరకూ 2,300 మందికి పైగా మహిళా పోలీసులు ఉంటారని మంత్రి తెలిపారు. అందులో 2,100 మందికిపైగా కానిస్టేబుళ్లు, 187 మంది ఎస్సైలు, 61 మంది పోలీస్ ఇన్‌స్పెక్టర్లు, 16 మంది డీఎస్పీలు, ఐదుగురు ఎస్పీలు, ఒక ఐజీ, ఒక అదనపు డీజీపీ ఉంటారని మంత్రి వివరించారు. సీనియర్ మహిళా ఐపీఎస్ అధికారిణి, హోంశాఖ కార్యదర్శి అయిన నిపుణా తోరావణే భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించనున్నట్లు ఆయన వెల్లడించారు.

**ప్రధాని మోదీకి బార్బడోస్ ఉన్నత పురస్కారం**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి అరుదైన గౌరవం లభించింది. మోదీకి బార్బడోస్ దేశం ప్రతిష్మాత్మకమైన 'ఆనరరీ ఆర్డర్ ఆఫ్ ఫ్రీడం ఆఫ్ బార్బడోస్' పురస్కారాన్ని ప్రదానం చేసింది. కొవిడ్ మహమ్మారి సమయంలో మోదీ సమర్థ నాయకత్వం, విలువైన సహాయాన్ని గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేసింది. బార్బడోస్‌లోని బ్రిడ్జ్‌టౌన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మోదీ తరఫున విదేశాంగ సహాయ మంత్రి పబిత్రా మార్గెరిటా ఈ అవార్డును అందుకున్నారు.ఈ విషయాన్ని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ అవార్డును గతేడాది నవంబర్ 20న గయానాలోని జార్జ్‌టౌన్‌లో జరిగిన 2వ ఇండియా- లీడర్స్ సమ్మిట్ సందర్భంగా ప్రధాని మోదీతో జరిగిన సమావేశంలో బార్బడోస్ ప్రధాని మియా అమోర్ మోట్లీ ప్రకటించినట్లు పేర్కొంది.

## పరస్పర సహకారంతో

## భారత్, చైనా బలోపేతం

### చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీ



**బీజింగ్ :** భారత్‌తో విరోధం కంటే స్నేహమే కలిసొస్తుందని చైనా ఆలస్యం గ్రహించింది. నష్టం జరిగితేనే తప్ప తత్వం బోధ పడనట్టు ఇప్పుడు స్నేహమేరా జీవితం...స్నేహమేరా శాశ్వతమంటూ...రాగాలు తీస్తోంది.చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీ భారత్, చైనా దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు.పరస్పరం విరోధం పెంచు కొనే కంటే భాగస్వాముల్లా కలిసి పనిచేయడం ఉత్తమమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇరుదేశాల ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆసియాలోనే కీలకమైన తమ రెండు దేశాల మధ్య సహకారం అత్యంత ముఖ్యమన్నారు. దీనిని ఆయన సమన్వయంతో చేసే నృత్యంతో పోల్చారు. 'చైనా-భారత్ భాగస్వాములుగా పరస్పర విజయానికి సహకరించుకోవాలి. దీనిని సాధించడానికి డ్రాగన్-ఎలిఫెంట్ డ్యాన్స్ ఒక్కటే ఇరుపక్షాలకు ఉన్న సరైన మార్గం' అని వాంగ్ యీ వ్యాఖ్యానించారు. ఇరుదేశాలు పరస్పరం చిన్నబుచ్చుకోవడం కంటే..ఒకరికొకరు (మిగతా 2లో)

## నాగబాబు నామినేషన్

### కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలోకి..



**అమరావతి(విశాఖసమాచారమ్) :** సినీనటుడు, జనసేన నాయకుడు కొణిదెల నాగబాబు ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఏపీలో ఖాళీ కానున్న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాగబాబు పేరును ప్రకటించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా నాగబాబు అభ్యర్థిత్వాన్ని మంత్రులు నారా లోకేష్, నాదెండ్ల మనోహర్, విష్ణుకుమార్‌రాజు బలపరిచి నామినేషన్ పత్రంపై సంతకం చేశారు. నామినేషన్ పత్రాన్ని నాగబాబు రిటర్నింగ్ అధికారి వనితారాణికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌రావు, బొలిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి రోజాకు షాక్!

**అమరావతి (విశాఖ సమాచారవమ్) :** గత ప్రభుత్వ హయాంలో 'ఆడుదాం ఆంధ్రా' ద్వారా జరిగిన అవినీతి అక్రమాలు అవక తవకలపై శాసన మండలిలో మంత్రి రాంప్ర సాద్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దీనిపై స్వతంత్ర విచారణ కమిటీ వేస్తున్నట్లు ప్రకటన చేశారు.45 రోజుల్లో సభకు నివేదిక అందిస్తామన్న మంత్రి రాంప్రసాద్ వెల్లడి. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి రోజాకు త్వరలోనే నోటీసులు అందజేయనున్నట్టు సమాచారం.ఇటీవల సామజిక మాధ్యమాల్లో 'ఆడుదాం ఆంధ్రా'లో అవినీతి, అక్రమాలు జరగలేదని రోజాకు ప్రభుత్వం క్లీన్ చిట్ ఇచ్చింది అంటూ వచ్చిన ఫేక్ ప్రచారాలపై కూడా ప్రభుత్వం ఆరా తీస్తున్నట్టు సమాచారం.



పార్వతీపురంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ (వార్త 8వ పేజీలో)

## కైలాసగిరి కొండపై

## అగ్ని ప్రమాదం




**విశాఖపట్నం (విశాఖసమాచారమ్) :** ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ కైలాసగిరి కొండపై అగ్ని ప్రమాదం సంభవించింది. పాత టైర్లకు, చెత్తకు మంట పెట్టడంతో మంటలు వ్యాపించాయి. మంటలు పెద్ద ఎత్తున వ్యాపించడంతో వ్యాపారులు, పర్యాటకులు భయాందోళనకు గురయ్యారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించడంతో ఘటనాస్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

## కేవీలో ఒకటో తరగతి అడ్మిషన్లకు నోటిఫికేషన్

**ఢిల్లీ :** దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల్లోని కేంద్రీయ విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకటో తరగతి నుంచి 11వ తరగతి వరకు ప్రవేశాలకు సంబంధించి అడ్మిషన్ నోటిఫికేషన్ కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కేవీఎస్) విడుదల చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, వాటి అనుబంధ సంస్థలు, రక్షణ రంగ సంస్థల్లో పనిచేస్తున్నవారి పిల్లలు, తల్లిదండ్రులకు ఏకైక సంతానంగా ఉన్న బాలికలకు తొలి ప్రాధాన్యం ఉంటుంది. ఎలాంటి ప్రవేశ పరీక్ష ఉండదు. అర్హత ఉన్న వారు ఎవరైనా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.కేంద్రీయ విద్యాలయాల్లో 1 నుంచి 11వ తరగతి వరకు ప్రవేశాలకు సంబంధించి ఎస్సీ అభ్యర్థులకు 15 శాతం, ఎస్టీ అభ్యర్థులకు 7.5 శాతం, ఓబీసీ అభ్యర్థులకు 27 శాతం, దివ్యాంగులకు 3 శాతం చొప్పున సీట్ల రిజర్వేషన్ ఉంటుంది. అన్ని కేంద్రీయ విద్యాలయాలకు ఇది వర్తిస్తుంది.ఒకటో తరగతిలో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులకు మార్చి 31 నాటికి వయసు 6 నుంచి 8 ఏళ్ల మధ్య ఉండాలి. రెండో తరగతి ప్రవేశానికి 7-9 ఏళ్ల మధ్య, మూడు, నాలుగో తరగతులకు 8-10, 5వ తరగతికి 9-11, ఆరుకు 10-12, 7వ తరగతికి 11-13, 8వ తరగతికి 12-14, 9వ తరగతికి 13-15, 10వ తరగతికి 14-16 ఏళ్ల మధ్య నిర్దేశించిన మేరకు తప్పనిసరిగా వయోపరిమితి ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.



**ఎంపిక ప్రక్రియ ఎలా ఉంటుందంటే..**

ఒకటో తరగతి ప్రవేశాలు ఆన్‌లైన్ లాటరీ సిస్టమ్ ద్వారా ఎంపిక చేస్తారు. రెండు నుంచి 8వ తరగతి వరకు ప్రవేశాలకు ఎలాంటి ప్రవేశ పరీక్షలు ఉండవు. ప్రయారిటీ కేటగిరీ సిస్టం ప్రకారం సీట్ల కేటాయింపు ఉంటుంది. సీట్ల సంఖ్య కంటే దరఖాస్తులు ఎక్కువగా వస్తే మాత్రం లాటరీ సిస్టం ఎంపిక చేస్తారు. 9వ తరగతిలో ప్రవేశాలకు మాత్రం ప్రవేశ పరీక్ష ఉంటుంది. 11వ తరగతిలో ప్రవేశాలకు పదోతరగతి మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. పదో తరగతిలో మిగిలిన సీట్లు ఉంటేనే ప్రవేశాలు ఉంటాయి. ఇక 11వ తరగతి ప్రవేశాలకు రిజిస్ట్రేషన్లు పదో తరగతి (మిగతా 2లో)

## మేమున్నామని..

## మీకేం కాదని..


### మిమ్మల్ని తీసుకెళ్లడానికి వస్తున్నామని వ్యోమగాములకు ట్రంప్ సందేశం



**వాషింగ్టన్:** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ 9 నెలలుగా చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. త్వరలోనే వారు భూమి మీదకు రానున్నట్లు పలు మీడియా సంస్థలు పేర్కొంటున్నాయి. సునీత కూడా మంగళవారం ఐఎస్ఎస్ నుంచి విలేకరులతో మాట్లాడుతూ (మిగతా 2లో)

# గంగా మాత ఆశీస్సులతో దేశ సేవ: ప్రధాని మోదీ

## ఉత్తరాఖండ్‌లో పర్యాటకాభివృద్ధికి చర్యలు చేపట్టాలని సూచన



**హర్సిల్/న్యూఢిల్లీ:** ఉత్తరాఖండ్‌లో పర్యాటక రంగ అభివృద్ధికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఇక్కడ ఏదో ఒక సీజన్‌కు పరిమితం కాకుండా ఏడాది పొడవునా పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంచు కొండలు, ప్రకృతి రమణీయతతో కూడిన సుందరమైన రాష్ట్రం ఉత్తరాఖండ్‌లో ఆఫ్ సీజన్ అనేదే ఉండకూడదని పేర్కొన్నారు. పర్యాటర రంగాన్ని అభివృద్ధి చేసుకుంటే స్థానికులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, తద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ ఉత్తరాఖండ్‌లో పర్యటించారు. ఉత్తరకాశీ జిల్లాలోని ముఖ్వా గ్రామంలో గంగా మాత ఆలయాన్ని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. తనను గంగా మాత దత్తత తీసుకున్నట్లు భావిస్తున్నానని, ఆ తల్లి ఆశీస్సులే తనను కాశీ(వారణాసి)కి తీసుకెళ్లాయని, దేశ ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాయని వ్యాఖ్యానించారు. అనంతరం హర్సిల్ గ్రామంలో బహిరంగ సభలో నరేంద్ర మోదీ ప్రసంగించారు. ఉత్తరాఖండ్‌లో శీతాకాలంలో పర్యటిస్తే చక్కటి అనుభూతి లభిస్తుందని అన్నారు. దేశమంతా పొగమంచుతో కప్పబడి ఉన్న సమయంలో ఉత్తరాఖండ్ మాత్రం సూర్యకాంతిలో స్నానమాడుతూ కనిపిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 12 నెలల టూ రిజం విజన్‌ను ప్రధానమంత్రి ప్రశంసించారు. పర్యాటకులను ఆకర్షించడానికి బహుముఖ చర్యలు అవసరమని పేర్కొన్నారు. వేసవి కాలంలో పర్యాటకులతో కళకళలాడే ఉత్తరాఖండ్ చలికాలంలో మాత్రం ఖాళీగా దర్శనిస్తోందని, ఈ పరిస్థితి మారాలని స్పష్టంచేశారు. అన్ని సీజన్లలో పర్యాటకులు భారీగా తరలివచ్చేలా వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని కోరారు. వింటర్ టూరిజం మనం లక్ష్యం కావాలని అన్నారు. చలికాలంలోనే అసలైన ఉత్తరాఖండ్‌ను అనుభూతి చెందవచ్చని పర్యాటకులకు సూచించారు. గిరిజన గ్రామమైన జదూంగ్ నుంచి హర్సిల్ విలేజ్ వరకూ ట్రెక్, బైక్ జర్నీని ప్రధాని మోదీ జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్రంలో రెండు కీలకమైన రోప్‌వే ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు గుర్తుచేశారు. రోప్‌వే ప్రాజెక్టుతో కేదార్‌నాథ్ ప్రయాణం 9 గంటల నుంచి 30 నిమిషాలకు తగ్గిపోతుందని వెల్లడించారు. వివాహాలు చేసుకొనేందుకు, సినిమాలు, షార్ట్‌ఫిలింల షూటింగ్‌లకు ఉత్తరాఖండ్‌లో చక్కటి వేదికలు ఉన్నాయని, వీటిని ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సరిహద్దు గ్రామమైన హర్సిల్‌లో అడుగుపెట్టిన మొట్టమొదటి ప్రధానమంత్రి మోదీయేనని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీ పేర్కొన్నారు.

# కేంద్రంపై స్టాలిన్ 'డీలిమిటేషన్' వార్..




### ఏడు రాష్ట్రాల సీఎంలకు లేఖ

**న్యూఢిల్లీ:** లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కేంద్రంపై పోరాడుతున్నారు. ఈ విషయంపై తాజాగా ఏడు రాష్ట్రాల సీఎంలకు లేఖ రాశారు. కేంద్రం ప్రతిపాదించిన డీలిమిటేషన్ కసరత్తుకు వ్యతిరేకంగా 'జాయింట్ యాక్షన్ కమిటీ' ఏర్పాటు చేద్దామని పిలుపునిచ్చారు. ఇటీవల తమిళనాడులో స్టాలిన్ నేతృత్వంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో జరిగిన తీర్మానం ఆధారంగా ఈ లేఖలు రాశారు. కేరళ, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, పశ్చిమ్ బెంగాల్, ఒడిశాకు వీటిని పంపారు. సమష్టి కార్యాచరణ కోసం మార్చి 22న చెన్నైలో సమావేశానికి హాజరుకావాలని కోరారు. అలాగే ఈ రాష్ట్రాలకు చెందిన సీనియర్ నేతలు, అధికార, ప్రతిపక్ష నాయకులను ఆయన ఆహ్వానించారు. "డీలిమిటేషన్ అనేది సమాఖ్యవాదంపై చేస్తోన్న దాడి. ఇది పార్లమెంట్‌లో మన హక్కులకు కోత పెట్టి, జనాభాను నియంత్రించిన రాష్ట్రాలను శిక్షించడమే అవుతుంది. ఈ అన్యాయాన్ని మేం సహించబోం" అని స్టాలిన్ ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు.

# భవిష్యత్తులో విద్యుత్ చార్జీలు పెంచం

## అసెంబ్లీలో మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అమరావతి (విశాఖ సమాచారమ్) :** వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని విద్యుత్ వ్యవస్థ సర్వనాశనం అయ్యిందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. కూటమి ప్రభుత్వం భవిష్యత్తులో కూడా విద్యుత్ చార్జీలను పెంచబోదు మరో సారి సభా ముఖంగా స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీలో వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమాధానం ఇచ్చారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ..... విద్యుత్ చార్జీలను వైసీపీ నాయకులే పెంచి, వాటిపై వాళ్లే ధర్నాలు చేసి, సభలో ఏమీ తెలియనట్టు ప్రశ్నలు అడుగుతున్నారని మండిపడ్డారు. ఇదొక వింత సంప్రదాయమని పేర్కొన్నారు. వారం రోజులు తిరగక ముందే మండలిలో అడిగిన ప్రశ్నలే.. మళ్లీ అసెంబ్లీలో అడిగి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు చూస్తున్నారని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భాధ్యతారాహిత్యంతో వైసీపీ సభ్యులు సభకు రాకపోయినా సరే... ప్రభుత్వం తరపు నుంచి బాధ్యతాయుతంగా సభ్యులు అడిగిన ప్రతీ ప్రశ్నకు సమాధానం ఇస్తున్నామని తెలిపారు. 2022-23, 2023-24 ఏడాదికి గాను వైసీపీ ప్రభుత్వం ప్రజలపై రూ.15 వేల కోట్లు భారం మోపిందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. గతంలో 2014-19 వరకు మా ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విద్యుత్ చార్జీలు పెంచలేదన్న విషయాన్ని గుర్తు చేశారు. నాడు తెలుగుదేశం ప్రభుత్వం దిగిపోయేనాటికి మిగులు విద్యుత్ తో రాష్ట్రాన్ని వైసీపీ ప్రభుత్వానికి అప్పగించామని చెప్పిన మంత్రి... గత ఐదేళ్లలో విద్యుత్ వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం విచ్ఛిన్నం చేసిందని స్పష్టం చేశారు. జగన్ అనాలోచిత చర్యలతో 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపారని వైసీపీ నాయకులపై మండిపడ్డారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను కూడా వైసీపీ నాయకులు తరిమి కొట్టారని పేర్కొన్న మంత్రి గొట్టిపాటి... గత టీడీపీ హయాంలో 8 గిగావాట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి చేసిన విషయాన్ని సభలో ప్రస్తావించారు. అధిక ధరలకు విద్యుత్ కొనుగోళ్లు చేసిన వైసీపీ ప్రభుత్వం వేల కోట్లు దోపిడీ చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో విద్యుత్ కొనుగోళ్లు భారీగా తగ్గాయని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. గత ప్రభుత్వం ఏపీ జెన్కోను నిర్వీర్యం చేసిందని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జెన్ కో నుంచి పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ... విద్యుత్ కొనుగోళ్లు తగ్గించినట్లు మంత్రి స్పష్టం చేశారు.

# ఇక విశాఖ వంతు

(మొదటి పేజీ తరువాయి)

వారికి అవసరం ఉంటుంది. కలెక్టర్‌కు ఇచ్చే నోటీసులో సంతకాలు పెట్టాల్సి ఉండటంతో, వైసీపీ కార్పొరేటర్లు బయటకు వస్తారా..? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఆ పార్టీ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ కార్పొరేటర్లతో సమావేశం ఏర్పాటు చేసి, పార్టీ మారొద్దని, భవిష్యత్తు బాగుంటుందని హితబోధ చేశారు. అయితే మేయర్‌పై ఉన్న వ్యతిరేకతతో కార్పొరేటర్లు సంతకాలు చేసేందుకు ముందుకొస్తారని కూటమి నాయకులు ఆశాభావంతో ఉన్నారు.

**సంతకాలపై దృష్టి:** అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే ముందు మెజార్టీ సభ్యుల సంతకాలు సేకరించాల్సి ఉంటుంది. ఆ సంతకాలతో పాటు, అవిశ్వాసం పెట్టడానికి వీలుగా సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం కౌన్సిల్‌లో 97 మంది సభ్యులు ఉండగా, 64 మంది కార్పొరేటర్లు అవిశ్వాసానికి అనుకూలంగా సంతకాలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత బలాబలాలు చూస్తే కూటమికి 56 మంది, వైకాపాకు 39 మంది, సీపీఎంకు ఒకరు, సీపీఐకి ఒకరు ఉన్నారు.

# పరస్పర సహకారంతో భారత్, చైనా బలోపేతం

(మొదటి పేజీ తరువాయి)

మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. పరస్పర సహకారమే రెండు దేశాల ప్రజల ప్రాథమిక ప్రయోజనాలను బలోపేతం చేస్తుందన్నారు. ఇక న్యూఢిల్లీ-బీజింగ్ మధ్య మెరుగైన సంబంధాలు ప్రపంచవ్యాప్తంగా గ్లోబల్ సౌత్ దేశాలకు కూడా ప్రయోజనమన్నారు. అంతర్జాతీయ సంబంధాల్లో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసి.. అంతర్జాతీయ వేదికలపై గ్లోబల్ సౌత్ (పేద దేశాల) స్థానాన్ని శక్తిమంతం చేస్తుందన్నారు. ఇరుదేశాల మధ్య వివాదాలను దౌత్యమార్గంలో పరిష్కరించుకొంటామని.. సమష్టి ప్రయోజనాలను కాపాడుకోవడానికి సహకారం అవసరమని వాంగ్ అభిప్రాయ పడ్డారు. 'చర్చల ద్వారా పరిష్కారం కానీ సమస్యే లేదు. అదే సమయంలో సహకారంతో చేరుకోలేని లక్ష్యాలు లేవు' అని వెల్లడించారు. దక్షిణాఫ్రికాలో జరిగిన జీ20 విదేశాంగ మంత్రుల భేటీలో భారత మంత్రి జైశంకర్‌తో చైనా మంత్రి వాంగ్ యీ భేటీ అయ్యారు. ఆ తర్వాత కొన్ని వారాల్లోనే ఈ ప్రకటనలు వెలువడ్డాయి. వాస్తవానికి 2020లో గల్వాన్ ఘర్షణ తర్వాత ఇరుదేశాల మధ్య సంబంధాలు అట్టడుగుస్థాయికి పడిపోయాయి. ఆ తర్వాత పలు విడతలుగా ఇరుదేశాలకు చెందిన దౌత్యవేత్తలు, సైనికాధికారులు చర్చలు జరిపారు. 2024లో ప్రధాని మోదీ-చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ బ్రిక్స్ సదస్సు సందర్భంగా కజాన్‌లో భేటీ అయ్యారు. ఆ తర్వాతనే సరిహద్దుల్లో ఉద్రిక్తతలు ఉన్నచోట్ల నుంచి ఇరుదేశాల బలగాలు వెనక్కి తగ్గి పాత స్థితికి చేరుకొన్నాయి. మరోవైపు ఈ ఏడాది చైనా షాంఘై సహకార సంస్థ సమావేశాలకు ఆతిథ్యం ఇస్తోంది. భారత ప్రధాని మోదీ అందులో పాల్గొనడం అత్యంత కీలకంగా మారనుంది.

# నింగిలో పేలిన స్టార్‌షిప్ రాకెట్



**వాషింగ్టన్ :** ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ ప్రయోగించిన స్టార్‌షిప్ మెగా రాకెట్ నింగిలో పేలిపోయింది. ఇది నిజంగా ఆ సంస్థకు పెద్ద కుదుపు. టెక్సాస్‌లోని బొకాచికా వేదికగా సాయంత్రం 5:30 గంటలకు ఓ రాకెట్‌ను ప్రయోగించారు. అయితే, ఆ రాకెట్ తొలుత విజయ వంతంగా నింగిలోకి దూసుకెళ్లినా అంతరిక్షంలో అది పేలిపోయింది. దీనికి సంబం ధించిన వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతు న్నాయి. రాకెట్ పేలిపోవడంపై స్పేస్‌ఎక్స్ స్పందించింది. ఇటీవల నిర్వహించిన ప్రయోగం సైతం ఇలాగే జరిగినట్లు తెలిపింది. వీటినుంచి పాఠాలు నేర్చుకుంటా మని వెల్లడించింది. ఇక, రాకెట్ పేలిపోవడంతో దానినుంచి భారీగా శకలాలు కిందికి దూసుకొచ్చాయి. ఫ్లోరిడా, బహామాస్ ప్రాంతాల్లోని ఆకాశంలో ఈ శకలాలు తారాజువ్వల్లా కనిపించాయి. ఈ క్రమంలోనే ఎయిర్ ట్రాఫిక్‌కు సైతం అంతరాయం ఏర్పడింది. ఇదిలాఉండగా.. జనవరిలోనూ స్పేస్‌ఎక్స్ నిర్వహించిన పునర్వినియోగ భారీ రాకెట్ స్టార్‌షిప్ విఫలమైంది. సాంకేతిక కారణాల వల్లే రాకెట్ పేలిపోయినట్లు ఆ సంస్థ పేర్కొంది. ఆ రాకెట్‌కు సంబంధించిన శకలాలు కరేబియన్ సముద్రంలో పడ్డాయి. అయితే, బూస్టర్ క్షేమంగా లాంచ్ ప్యాడ్ పైకి చేరింది.

# కేవీలో ఒకటో తరగతి అడ్మిషన్లకు నోటిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)

ఫలితాలు వెల్లడైన తర్వాత పది రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. అలాగే 20 రోజుల్లోపు ఎంపికైన వారి జాబితాను వెల్లడిస్తారు. ఒకటో తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవల్సి ఉంటుంది. ఇక రెండు ఆపై తరగతులకు మాత్రం ఆఫ్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవల్సి ఉంటుంది. అంటే ఆయా కేంద్రీయ విద్యాలయాలకు వెళ్లి నేరుగా దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుంది.

**ముఖ్య తేదీలు..**

-1వ తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తేదీలు: మార్చి 1 నుంచి మార్చి 21 వరకు..
-ఒకటో తరగతి తొలి ప్రొవిజినల్ జాబితా వెల్లడి తేదీ: మార్చి 25
-రెండో ప్రొవిజినల్ జాబితా వెల్లడి తేదీ: ఏప్రిల్ 4
-మూడో ప్రొవిజినల్ జాబితా వెల్లడి తేదీ: ఏప్రిల్ 7, 2025.
-రెండు, ఆ పైతరగతుల్లో ఖాళీగా ఉండే సీట్ల భర్తీ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు చివరి తేదీ: జులై 31, 2025.
-రెండో తరగతికి ఎంపికైన వారి జాబితా వెల్లడి తేదీ: ఏప్రిల్ 17, 2025.
-11వ తరగతి మినహా మిగతా తరగతులన్నింటిలో అడ్మిషన్లకు తుది గడువు: జూన్ 30, 2025.

# చోర శిఖామణులు

## రూ.1 కోటి విలువైన తల వెంట్రుకలను దొంగలించిన దొంగలు



**బెంగళూరు:** రాత్రిళ్లు వజ్రాభరణాల దుకాణాలు, ఏటీఎంలను కొల్లగొట్టి దొంగలు కోట్ల విలువైన నగదు, బంగారాన్ని కొట్టేసే ఘటనలు రోజు ఏదో ఒక రాష్ట్రంలో చూస్తున్నే ఉన్నాం. కానీ ఈసారి కొందరు దొంగలు తమ చోరకళలో వైవిధ్యం ప్రదర్శించారు. బంగారం కొట్టేస్తే దానిని నగదుగా, ఒక వేళ నగదును కొట్టేస్తే నేరుగా వాడుకునే వెసులుబాటు దొంగలకు ఉంది. కానీ చోరీ చేసిన దానిని వెంటనే నగదుగా వాడుకునే అవకాశం లేకపోయినా సరే కొందరు దొంగలు జుట్టుపై కన్నేశారు. జుట్టుపై అంటే వ్యక్తుల తలపై ఉండే జుట్టుపై కాదు. అప్పటికే మొక్కు రూపంలోనో, మరేదైనా కారణంగానో తలనీలాలను కత్తిరించగా వాటిని సేకరించిన ఓ వ్యాపారి తన గిడ్డంగిలో భద్రపరిచగా దానిని దొంగలు చోరీచేసి ఎత్తుకుపోయారు. కిలోల కొద్దీ జుట్టును చోరశిఖామణులు కొట్టేసిన ఘటన కర్ణాటకలోని బెంగళూరులో జరిగింది. దాదాపు రూ.90 లక్షల నుంచి రూ.1 కోటి విలువైన జుట్టును కొట్టేసిన వార్త తెలిసి ఆ గోడౌన్ యజమాని లబోదిబోమని ఏడ్వడంతో జుట్టు దోపిడీ వార్త ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. చోరీ విషయం తెల్సి పోలీసులు భారతీయ న్యాయసంహిత చట్టాల కింద కేసు నమోదుచేసి దర్యాప్తు మొదలెట్టారు.

**తెలిసిన వ్యక్తుల పనేనా?**

కోటి విలువైన సరుకు ఉందన్న పక్కా సమాచారంతోనే దొంగలు చోరీకి తెగబడ్డారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇటీవల చైనా నుంచి వచ్చిన ఒక వ్యాపారి ఈ జుట్టును సరిచూసుకుని మార్కింగ్ వేసి మరీ వెళ్లారని యజమాని వెంకటస్వామి పోలీసులకు చెప్పారు. ఫిబ్రవరి 28 అర్ధరాత్రి పెద్దకారులో వచ్చిన ఆరుగురు దొంగలు వెంట తెచ్చుకున్న ఇనుపరాడ్లతో గోడౌన్ షట్టర్‌ను పగలగొట్టి తెరచి 27 సంచులను ఒక్కోటి ఎత్తుకెళ్లడం మొదలెట్టారు. ఇది గమనించిన సమీపంలోని ఓ వ్యక్తి ఆరాతీయగా 'ఈ సరుకుంతా మాదే. వేరే చోటుకు తరలిస్తున్నాం'అని దొంగలు తెలుగులో ఏమాత్రం అనుమానంరాని రీతిలో అతనికి చెప్పారని పోలీసులు తెలిపారు. హడావిడిగా కారులోకి ఎక్కించడం, జుట్టు రోడ్డపై చెల్లాచెదురుగా పడటం గమనించిన మరో వ్యక్తి వెంటనే హెల్ప్‌లైన్ 112కు ఫోన్‌చేసి చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకోగా అప్పటికే దొంగలు ఉడాయించారు. లక్ష్మీపుర క్రాస్ ప్రాంతంలో కేశాల వ్యాపారులు ఎక్కువ. ఈ సరకు విషయం తెల్సిన వ్యక్తులే ఈ దొంగతనం చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. అంతర్రాష్ట్ర కేశాల వ్యాపారంలో ఉన్న వ్యక్తుల హస్తం ఈ చోరీలో ఉండొచ్చనే అనుమానాలు పోలీసులు వ్యక్తంచేశారు.

# మేమున్నామని...మీకేం కాదని..

(మొదటి పేజీ తరువాయి)

త్వరలోనే భూమి మీదకు చేరుకుంటానని తెలిపారు. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. 'మేము మిమ్మల్ని ప్రేమిస్తున్నాం..తీసుకెళ్లడానికి వస్తున్నాం' అని వ్యోమగాములకు సందేశం పంపిస్తూ భరోసా ఇచ్చారు. అత్యంత అసమర్థ అధ్యక్షుడి పాలన(బైడెన్) కారణంగానే ఇంతకాలం మీరు చిక్కుకుపోయారని.. వారిని భూమి పైకి తీసుకువచ్చేందుకు బైడెన్ ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదని మండిపడ్డారు. వారు చేసిన ఆలస్యం వల్ల వ్యోమగాములు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సివస్తోందని విమర్శించారు. ఇకపై అలా జరగనివ్వనని ఆయన పేర్కొన్నారు. వ్యోమగాములను సురక్షితంగా భూమి పైకి తీసుకొచ్చే బాధ్యతను ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు అప్పగించినట్లు ట్రంప్ వెల్లడించారు. దాదాపు రెండు వారాల్లో మస్క్ స్పేస్‌ఎక్స్ క్యాప్సూల్‌ను ప్రయోగించడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ప్రణాళిక ప్రకారం ఐఎస్‌ఎస్‌లో ఉన్న వ్యోమగాములు సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్‌లు వారం రోజులకే భూమిని చేరుకోవాల్సి ఉంది. అయితే స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వ్యోమగాములు లేకుండానే అది భూమిని చేరుకుంది. సునీతా విలియమ్స్, విల్‌మోర్‌లు అప్పటినుంచి ఐఎస్‌ఎస్‌లోనే ఉంటున్నారు. వారిని తిరిగి తీసుకురావడానికి నాసా స్పేస్‌ఎక్స్‌తో కలిసి పనిచేస్తోంది. ఈ ఇద్దరు వ్యోమగాములను తీసుకురావాలంటే అంతకంటే ముందు కొందరిని ఐఎస్‌ఎస్‌కు పంపించాల్సి ఉంటుంది. ఈ ప్రయోగం చేపట్టడానికి స్పేస్‌ఎక్స్ సమయం కావాలనడంతో ఈ ఆలస్యం జరిగిందని గతంలో అధికారులు పేర్కొన్నారు. తాజాగా వ్యోమగాములు స్పేస్ నుంచి మీడియాతో మాట్లాడారు. తమ కోసం మార్చి 12న స్పేస్‌ఎక్స్‌కు చెందిన క్రూ-10 అంతరిక్షనౌక రానుందని, నౌకలో కొత్తగా ఐఎస్‌ఎస్‌లోకి వచ్చే వ్యోమగాములు తమ బాధ్యతలు తీసుకోనున్నారని చెప్పారు. తర్వాత మార్చి 19న ఆ నౌకలోనే తిరిగి భూమి మీదకు తాము బయల్దేరనున్నామని తెలిపారు. అయితే ట్రంప్ తాజా ప్రకటనతో వారిని భూమిపైకి తీసుకు వచ్చేందుకు స్పేస్‌ఎక్స్ చేపట్టిన చర్యలను వేగవంతం చేసినట్లు తెలుస్తోంది.

## సకల దేవతల ఆలయంలో

# ఘనంగా పూజా కార్యక్రమాలు



**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):-** స్థానిక రామాలయం వీధిలో ఉన్న సకల దేవతల ఆలయంలో పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ 16వ వార్షికోత్సవం సందర్భంగా శుక్ర వారం స్థానిక ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు తెల్లవారుజాము నుంచే భక్తులు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు

భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు గాను నిర్వాహకులు (ఆలయ కమిటీ సభ్యులు) తగిన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గోకాడ సత్యనారాయణ , వర్తక సంఘం కార్యదర్శి పెదరెడ్ల బేతాళుడు తోపాటు పసుపులేటి వినాయకరావు, ఉప్పల బంగారయ్య శెట్టి (రమేష్), ఎన్ ఈశ్వరరావు తదితరులు అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఉచితంగా మెగా మెడికల్ క్యాంప్

**దేవరాపల్లి, (విశాఖ సమాచారమ్):-** మండలంలో ఆదివారం అనగా 9వ తేదీన కైరళి ఇంగ్లీష్ మీడియం స్కూల్ అవరణలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, డయాబెటిస్, ఆర్థోపెటిక్, కార్డియాలజీ, గైనకాలజీ, డెంటల్,మరియు జనరల్ ఫిజీషియన్ మొదలు విభాగాల్లో నైపుణ్యం గల డాక్టర్లు సెర్వికల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ వంటి వాటికి ఉచిత స్క్రీనింగ్లు మరియు ఈసీజీ, లంగ్స్,బిపి,షుగర్లకు ఉచిత పరీక్షలు చేస్తామని, ఈ కార్యక్రమానికి గాను వి. దెంతల్, శ్వాస,లైన్స్ క్యాన్సర్ హాస్పటల్, కాంకరన్ చారిటబుల్ ట్రస్ట్, యువరాజ్ ఫౌండేషన్ సహాయంతో, ఈ ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని క్యాంప్ కోఆర్డినేటర్ డాక్టర్ పీకే జోష్ గారు, మీ సందేహాలకు,విశాఖ సమాచారం ప్రతినిధి పరవాడ రవి గారిని( మొబైల్ నెంబర్:95059 55059) సంప్రదించవలసిందిగా తెలియజేశారు.


**శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానం**
**జై భారత్ నగర్, కంచరపాలెం, విశాఖపట్నం జిల్లా**
**టెండర్ కం బహిరంగ వేలం ప్రకటన**
**ఆర్.సి.నెం.నిల్/2025.తేదీ.03.03.2025**

శ్రీ అమ్మవారి వార్షిక జాతర 20.03.2025 గురువారం నుండి 30.03.2025 ఆదివారం వరకు అత్యంత వైభవంగా జరుగును. జాతర నిమిత్తం 1.అమ్మవారికి చీర చూపించి వదిలి వేసిన చీరలు, జాకెట్టు ముక్కలు తీసుకొను హక్కు గాను 2.కొబ్బరికాయ సగభాగం తీసుకొను హక్కు గాను 3. దేవాలయం, రోడ్ మీద విద్యుత్ అలంకరణ 4.తాత్కాలిక క్యూ లైన్స్ నిర్మాణం, నిర్వహణ 5.పూజ సామగ్రి, దీక్ష వస్త్రాలు 6.జాతర రోజుల్లో డప్పులు వగైరాకు టెండర్లు ఆహ్వానిస్తున్నా ము. 13.03.2025 గురువారం ఉదయం 11.00లకు దేవాలయం వద్ద టెండరు దారులు, దేవదాయ ధర్మాదాయశాఖ అధికారుల సమక్షంలో టెండరు-కం-బహిరంగ వేలంపాట నిర్వహిస్తాము. పూర్తి వివరాలు కొరకు దేవస్థాన కార్యాలయం పని వేళలలో సంప్రదించగలరు.

**ఫోన్ నెం. 9440042536** **కార్యనిర్వహణాధికారి**


## నరసరావుపేటలో ప్రత్యేక వర్క్‌షాప్ ద్వారా ఏపీలో డిజిటల్ సేవలను విస్తరించిన ఫ్లిప్‌కార్ట్

**విజయవాడ, ఆంధ్రప్రదేశ్, (విశాఖ సమాచారమ్):-** భారతదేశపు స్వదేశీ ఇ-కామర్స్ మార్కెట్‌ప్లేస్ అయిన ఫ్లిప్‌కార్ట్, చిన్న వ్యాపారాలు మరియు చేతివృత్తులవారికి తగిన సాధికారిత అందించటం పట్ల తన నిబద్ధతను మరింతగా వెల్లడిస్తూ ఆంధ్రప్రదేశ్‌లోని నరసరావుపేటలో ఒక వర్క్‌షాప్‌ను నిర్వహించింది. ఈ వర్క్‌షాప్ ఈ ప్రాంతంలోని మహిళా స్వయం సహాయక బృందాలు, వ్యవస్థాపకులు మరియు మహిళా విద్యార్థులలో వ్యవస్థాపకత మరియు డిజిటల్ చేరికను పెంపొందించడానికి కీలక వేదికగా పనిచేయడం లక్ష్యంగా పెట్టుకుంది. దూర దృష్టితో కూడిన ఆంధ్రప్రదేశ్ గౌరవనీయ ముఖ్యమంత్రి శ్రీ చంద్ర బాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో వ్యవస్థాపకత మరియు డిజిటల్ సమ్మిళితతను ప్రోత్సహించే కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఫ్లిప్‌కార్ట్ నాయకత్వంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గౌరవ పార్లమెంటు సభ్యుడు శ్రీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు పాల్గొన్నారు.

నరసరావుపేటలో జరిగిన వర్క్‌షాప్‌లో మహిళా వ్యవస్థాపకులు, స్వయం సహాయక బృందాలు మరియు విద్యార్థులు సహా 70 మందికి పైగా అభ్యర్థులు పాల్గొన్నారు, వ్యాపార వృద్ధికి డిజిటల్ వాణిజ్యాన్ని ఎలా ఉపయోగించుకోవాలో ఆచరణాత్మక శిక్షణ ఇచ్చారు. ఈ సెషన్‌లో మార్కెట్ అవకాశాలు, ఉత్పత్తి జాబితాలను మెరుగుపరచడం చేయడం, ఉత్పత్తి ఇమేజింగ్‌ను మెరుగుపరచడం, గ్రామీణ వ్యవస్థాపకులు ఇ-కామర్స్ పర్యావరణ వ్యవస్థలో సజావుగా కలిసిపోవడానికి లాజిస్టిక్స్ మద్దతును క్రమబద్ధీకరించడంపై లోతైన చర్చలు జరిగాయి.

# మహిళా దినోత్సవ స్ఫూర్తికి ప్రభుత్వాల తూట్లు

## పోరాటల ద్వారానే సమస్యల పరిష్కారం - ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** మహిళా దినోత్సవం స్ఫూర్తిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నా యని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల పేర్కొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గౌరవప్రదమైన జీవితం దాతృత్వం కాదు.. అది మన హక్కు అన్న నినాదం తో శుక్రవారం ఉదయం జీవీఎంసీ గాంధీ విగ్రహం ముందు మహిళా సమాఖ్య జిల్లా సమితి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా విమల మాట్లా డుతూ మహిళల సాధికారత పాలకుల మాటల్లోనే తప్ప చేతల్లో ఉండడం లేదని విమర్శలు చేశారు. శ్రామిక మహిళల పోరాట స్ఫూర్తి క్రమంగా కనుమరుగు అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా దినోత్సవం ఓటు బ్యాంకు రాజకీయాలకు వేదిక గా మారిపోతున్నదని ధ్వజమెత్తరు. ఎన్నికల్లో మహిళల ఓట్ల కోసం కురిపించిన హామీలు ఒక్కటి కూడా అమలు కావడం లేదని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఫ్రీ బస్సు ప్రయాణం, తల్లికి వందనం హామీలే ఇందుకు నిదర్శనం అని తెలిపారు. రా జ్యాంగం అందించిన సమానత్వం 75 ఏళ్ళ అయినా సాధ్యం కాలేదు అని, నిత్యం మహిళా సమాజంపై దాడులు పెరుగుతూనే ఉన్నా పాలకులకు పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ నేర విభాగం ఇస్తున్న నివేదికలే ఈ విషయాన్నీ బయట పెడుతున్నాయి అని పేర్కొన్నారు. మోదీ పాలనలో మహిళా సమాజం మరో వంద ఏళ్ళు వెనక్కు నెట్టబడినట్టు పేర్కొన్నారు. అన్ని రంగాల్లో మహిళలకు గుర్తింపు లేకుండా పోయిందని వాపోయారు. దేశంలో మనుధర్మం రాజ్యాంగంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మనుధర్మమమే మహిళలకు ప్రధాన శత్రువు అని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో మహిళా దినోత్సవం అందించిన పోరాట స్ఫూర్తి తో మహిళలు మరింత చైతన్యవంతం గా ఉద్యమాల వైపు అడుగులు వేయాలని పిలుపు నిచ్చారు.

జిల్లా కార్యదర్శి ఎం ఏ బేగం మాట్లాడుతూ పాలకుల తీరు కారణంగా మహిళల జీవితాల్లో వెలు గులు లేకుండా పోతున్నాయి అని ఆ గ్రహం వ్యక్తం చేశారు. మహిళా హ క్కుల పరిరక్షణ మహిళా ఉద్యమాల ద్వారానే సాధ్యమని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కె వనజాక్షి నేతలు ఏ దేవుడమ్మ , అరుణ, అన్నపూర్ణ, జి.జయ, బి.పుష్పలత, పావని పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

# బీసీ సంక్షేమంపై వంశీకృష్ణ ప్రస్తావన



**అమరావతి, (విశాఖ సమాచారమ్):-** అసెంబ్లీలో బీసీల అభ్యున్నతపై దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శుక్రవారం ప్రస్తావించారు. గత ప్రభుత్వ కాలంలో బీసీలకు 56 కార్పొరేషన్ లో పెట్టి ఎటువంటి నిధులు లేకుండా బీసీలకు అన్యాయం చేశారని తెలిపారు. మహా నాయకుడు ఎన్టీఆర్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ బీసీ ల సర్వతోభ్యున్నతికి తోడ్పడుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేస్తుం దని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 86,464 కోట్లు కేటాయిస్తే, గత ప్రభుత్వం ఐదు సంవత్సరాలలో రూ.136 వేల కోట్లు మాత్రమే కేటాయించారని , దీన్నిబట్టి బీసీలు పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని గుర్తు చేశారు. ఈ సం దర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి శ పవన్ కళ్యాణ్, గౌరవ మంత్రి లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలను సభ దృష్టికి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గారు తీసుకువెళ్ళారు. బీసీ కార్పొరేషన్ ద్వారా మన ప్రభుత్వము ప్రత్యేకమైన నిధులు మంజూరు గురించి, అదేవిధంగా గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్న సమయంలో బీసీలకు కారులోన్లు, పలు పనులకు లోన్లు ఇచ్చేవారు అవి కొనసాగిస్తామా, కులవృత్తులకు పనిముట్లు చాలా అవసరం వారికి సబ్సిడీ ద్వారా ఏమైనా పనిముట్లు అందజేస్తమా, కార్పొరేషన్ ద్వారా హస్తకళాకారులకు , సాంప్రదాయ వృత్తుల వారికి ఏమైనా ఆర్థికంగా సహకరం పై, పలు కులవృత్తులపై ఆధారపడిన వారికి విద్య పరంగా, వ్యాపార పరంగా మనం సహకారం పట్ల , బీసీ కార్పొరేషన్ లో లేని మిగతా బీసీ కులాల వారికి మనం కల్పించే ఆర్థిక సదుపాయాలు గురించి, శెట్టి శెట్టిబలిజ , ఈత, గవర ,పెరిక ,మత్స్యకారులు, యాదవ , గవర, నాయి బ్రాహ్మణ, ఇతర బీసీ కులాల అభ్యున్నతికి ఆర్థికంగా ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను తెలియపరచాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత మాట్లాడుతూ నా బీసీలు.. నా కాపులు... అని కులాలు చీల్చి గత ప్రభుత్వం ఓటు వేయించుకొని మోసం చేసిందని చెప్పారు. 2025-26 బడ్జెట్లో వాటి మీద ప్రభుత్వం బీసీలకు రూ.47,556 కోట్లు కేటాయించిందని తెలిపారు. బీసీలకు స్వయం ఉపాధి పథకాల కోసం రూ.1,977 కోట్లు, ఆదరణ పథకం కింద రూ 1000 కోట్లు ప్రకటించామని, కులవృత్తుల వారికి కులాల వారీగా సంక్షేమ పథకాలకు కేటాయించామని, 56 బీసీ కార్పొరేషన్ లో కొన్ని కార్పొరేషన్లు ఏర్పాటు కోసం ఇంకొన్ని కార్పొరేషన్ల కోసం ముఖ్యమంత్రి దశా దిశా నిర్దేశించారు వారి జనాభా ప్రకారం నిధులు కేటాయించడానికి ప్రతిపాదనలు చేశామని మంత్రి సమాధానం ఇచ్చారు.

# మహిళలకు కుట్టు శిక్షణ తరగతులు

## జిల్లా కలెక్టర్, బీసీ కార్పొరేషన్ చైర్మన్ దినేష్ కుమార్

**జి.మాడుగుల/పాడేరు, (విశాఖ సమాచారమ్):-** మార్చి 7.2024-25 ఆర్థిక సంవత్సరములో బిసి కార్పొరేషన్, ఈ డబ్ల్యూ ఎస్ కార్పొరేషన్ మరియు కాపు కార్పొరేషన్ ల ద్వారా మహిళలకు ప్రాథమిక కుట్టు శిక్షణ తరగతులను ఈ నెల ఎనిమిదవ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రారంభించడం జరుగుతుందని, జిల్లా కలెక్టర్ అండ్ బిసి కార్పొరేషన్ చైర్మన్ ఎఎస్ దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వివిధ కార్పొరేషన్ల ద్వారా 862 మంది మహిళలకు ప్రాథమిక కుట్టు శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. మహిళా లబ్దిదారుల వయస్సు 18 నుండి 50 సంవత్సరముల లోపు ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లా నివాసులై ఉన్నవారు అర్హులన్నారు. అదేవిధంగా ఆ అభ్యర్థులకు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలని, సచివాలయం ద్వారా పొందిన కుల ధృవీకరణ పత్రములు జత చేయాలని సూచించారు. ఈ మధ్య కాలం లో తీసుకున్న పాస్ పోర్ట్ సైజు ఫోటో జత చేసి మొబైల్ నెంబరు మరియు పూర్తి అడ్రస్ తో దరఖాస్తు చెయాలన్నారు.

శిక్షణ వ్యవధి 45/60/90 రోజుల వరకు ఉంటుందని, మహిళా లబ్దిదారులు తమ సౌలభ్యం మేరకు శిక్షణ ప్రారంభించే సమయంలో స్లాట్లను ఎంచుకోవచ్చన్నారు. బేసిక్ టైలరింగ్ పై శిక్షణ పూర్తయిన తర్వాత అభ్యర్థికి ఒక మోడల్ కుట్టు మిషన్ ఉచితముగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు వారి ధరఖాస్తు ఒక వారం రోజులలోగా ఆన్లైన్ (%ఖ్ర జూం://ఖజాశీఎఎఎం.ఖజాఎట-౦౦.ఱఅ%) ద్వారా నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంత అభ్యర్థులు సంబందిత మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారి కార్యాలయం నందు లేదా గ్రామ సచివాలయం నందు వెల్ఫేర్ సెక్రటరీ ల ద్వారా ధరఖాస్తు నమోదు చేసుకోవచ్చున్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన మహిళా లబ్దిదారులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కలక్టర్ కోరారు.

# వ్యాధుల నియంత్రణపై శిక్షణ




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.పి.జగదీశ్వర రావు వారి అధ్యక్షతన జగదాంబ కూడలి దగ్గరలో గల బిల్ జంక్షన్ సమావేశమందిరం నందు జిల్లా ప్రోగ్రాం అధికారులకు, పట్టణ మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులకు జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ పై ఒకరోజు పున: శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిదిగా రాష్ట్ర అదనపు సంచాలకులు డా.బి. సుబ్రమన్యేశ్వరి వారు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రములో జరుగుతున్న జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమం జిల్లాలో అన్ని ప్రాథమిక మరియు పట్టణ ఆరోగ్య కేంద్రములలో వైద్యాధికారులు మరియు పారామెడికల్ క్షేత్ర స్థాయి సిబ్బందికి ఏ విధంగా చేయాలి ప్రతీ ఒక్కరూ ప్రతీ శుక్రవారం డ్రై డే ఫ్రై డే పాటించాలని, యాంటి లార్వా పద్ధతులు ద్వారా దోమల నిర్మూలన వాటి పెరుగుదల నీరు నిల్వ లేకుండా చేసుకోవడం పరిసరాల పరిశుభ్రత పాటించడం మొదలగు విషయాల మీద శిక్షణా కార్యక్రమం పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.పి.జగదీశ్వర రావు వారు వైద్యులకు తెలియచేసారు.

తదుపరి జోనల్ మలేరియా అధికారి డా.పి.శాంతి ప్రభ వారు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా దోమలు ప్రబలకుండా డ్రై డే పాటించాలని మరియు నీటి నిల్వలు లేకుండా మురుగు కాలువలు శుభ్రపరచుకోవడం దోమలు పెరగకుండా నివారించవచ్చని తెలియచేసారు.

తదుపరి జిల్లా మలేరియా అధికారి తులసి వారు మాట్లాడుతూ జిల్లాలో అమలుపరుస్తున్న యాంటీ లార్వా పద్ధతులు మరియు డ్రై డే ఫ్రై డే నాడు నిర్వహిస్తున్న కార్యక్రమాలు మలేరియా సిబ్బంది ద్వారా మరియు వైద్య ఆరోగ్య సిబ్బంది ద్వారా ఎప్పటికప్పుడు తమ తమ పరిసరాల్లో యాంటీ లార్వా స్ప్రేయింగ్స్ చేయించడం మరియు అవగాహనా సదస్సులు నిర్వహించడం ద్వారా మలేరియా కేసులు రాకుండా అదుపులో ఉండేటట్లు విశాఖ జిల్లాలో చర్యలు తీసుకుంటున్నామని తెలియచేసారు.

ఈ పున: శిక్షణా కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు, పట్టణ మరియు ప్రాథమిక వైద్యాధికారులు, మలేరియా సిబ్బంది మరియు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో ఆత్మరక్షణపై అవగాహన




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ & పీజీ కళాశాల ఎంవిపి క్యాంపస్ సభా మందిరంలో ఆత్మరక్షణపై. అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి పీవీజీ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పి. వెంకట్, ఎంవిపి పోలీస్ స్టేషన్ సిఐ ఏ మురళి అతిధిగా విచ్చేసారు. సీఐ మురళి తన ఉపన్యా సంలో తల్లి గొప్పతనాన్ని తెలియ జేసారు. ప్రతి ఆడపిల్ల సమాజంలో ఏ విధంగా శక్తి యుక్తులతో ముందుకు వెళ్తూ తమ లక్ష్యాన్ని చేరుకోవాలో చక్కగా వివరించారు.

పివిజి చారిటబుల్ ట్రస్ట్ అధిపతి శ్రీ పోలిశెట్టి వెంకట్ గారు మహిళ ఎలాంటి పరిస్థితిని అయినా ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలో తెలియజేస్తూ, ఈ కార్యక్రమంలో భాగంగా, విద్యార్థులకు కరాటే శిక్షణ అందించారు. మహిళలు మరియు యువత ఆత్మరక్షణ పద్ధతులు నేర్చుకోవడం ఎంతో అవసరమని, ఇవి వారికి భద్రతతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు సహాయపడ తాయని తెలియజేశారు.

గాయత్రి విద్యా పరిషత్ యు.జి. నిర్దేశకులు డీ .గిరిధర్ గారు మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం పాఠశాల విద్యతో పాటు ఆత్మరక్షణ, క్రీడలు, వ్యక్తిత్వ వికాసం వంటి కోర్సులు కూడా నేర్చుకోవాలని సూచించారు.

ఈ అవగాహన కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, మరియు ఇతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు కరాటే ప్రాథమిక సూత్రాలను నేర్చుకొని ప్రాక్టీస్ చేశారు. హిందీ అధ్యా పకురాలు డాక్టర్ కే అనిత వందన సమర్పణ తో కార్యక్రమం ముగిసింది.

## రవాణా శాఖ, పోలీసుల స్కూల్ బస్సుల ఉమ్మడి తనిఖీ




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్)** స్థానిక రింగ్ రోడ్ వద్ద రవాణా శాఖ అధికారులతో కలిసి 15 స్కూల్ బస్సులపై ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తనిఖీ సందర్భంగా కొన్ని బస్సుల్లో నిబంధనల ఉల్లంఘనలను గుర్తించాము. దీనివల్ల 5 స్కూల్ బస్సులపై రవాణా శాఖ అధికారులు జరిమానాలు విధించారు.పిల్లల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఇలాంటి తనిఖీలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని రవాణా శాఖ అధికారులు స్థానిక ట్రాఫిక్ పోలీసు అధికారులు తెలిపారు. అన్ని విద్యా సంస్థలు తమ బస్సులను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేయడం జరుగుతోంది అన్నారు.ఈ తనిఖీ లలో జిల్లా రవాణా శాఖ అధికారులు రమణ, గోపికృష్ణ, అమృత గ్రీష్మ మరియు గీత కావ్య పాటు అనకాపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకటనారాయణ, ఎస్సై శేఖరం పాల్గొన్నారు.

విశాఖ సమాచారమ్

శనివారం 8-3-2025

## 9 నెలలు దాటినా అంతరిక్షంలోనే !

అంతరిక్షంలోకి వెళ్లిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ తిరిగి భూమి మీదికి ఎప్పుడు తిరిగివస్తారో ఎవరూ చెప్పలేకపోతున్నారు. మూడోసారి అంతరిక్షంలోకి వెళ్ళిన సునీతా వారం రోజుల్లోనే వెనక్కి రావాల్సి ఉండగా.. 9 నెలలు దాటినా ఆమెను వెనక్కి తీసుకు వచ్చే సూచనలు ఇప్పట్లో కనిపించడం లేదు. మార్చి 12న మరికొంతమంది వ్యోమగాములతో అంతరిక్షంలోకి వెళ్ళే స్పేస్ షిప్ లో సునీతా, ఆమెతోపాటు వెళ్ళిన బచ్ విల్మోర్‌లు భూమి మీదకి వస్తారనే ప్రచారం జరిగింది. తాజాగా సునీతా ఇచ్చిన స్టేట్మెంట్ చూస్తే.. వారు ఇప్పుడిప్పట్లో భూమి మీదకు వచ్చే అవకాశాలు చాలా తక్కువ అని తెలుస్తోంది. తాము భూమి మీదకి ఎప్పుడు తిరిగి వచ్చేది చెప్పడం చాలా కష్టం అని, సుదీర్ఘంగా అంతరిక్షంలో ఉండటం వలన వ్యక్తం అవుతున్న ఆందోళనలు అనవసరమైనవే అయినప్పటికీ ప్రజలు ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకోవడాన్ని తాము అర్థం చేసుకోగలమని తెలిపారు.

2030లో అంతరిక్ష కేంద్రం జీవిత కాలం పూర్తి కానున్న నేపథ్యంలో.. దానిని స్పేస్ నుంచి తప్పించే పనులు ముమ్మరంగా చేస్తోంది నాసా. ప్రస్తుతం అందుకు సంబంధించిన కీలక పనులు జరుగుతున్నాయని, అందువలన తాము భూమి మీదకి రావడానికి మరికొంత సమయం పట్టవచ్చని వారు పేర్కొన్నారు. అయితే సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్ లను భూమి మీదకి తీసుకురావడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఎలాన్ మస్క్ కు చెందిన స్పేస్ ఎక్స్ సహాయం కోరారు. దీనిపై స్పందించిన మస్క్ వారిని భూమి మీదకి సురక్షితంగా తీసుకు వచ్చేందుకు కొంత సమయం కావాలని అన్నారు. అప్పటి నుంచి నాసా, స్పేస్ ఎక్స్ తో కలిసి పని చేస్తోంది. జూన్ 5 వ తేదీన అమెరికన్ ఆస్ట్రోనాట్ బ్యారీ విల్ మోరీతో కలిసి.. బోయింగ్ స్టార్ లైనర్ స్పేస్ క్రాఫ్ట్ లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన సునీతా విలియమ్స్, నిజానికి జూన్ 14 నే భూమ్మీదకి తిరిగి రావాల్సి ఉంది. వారు వెళ్లిన స్టార్ లైనర్స్ లో సాంకేతిక సమస్యల కారణంగా వారిద్దరు అక్కడే చిక్కుకుపోయారు. ఇలా అన్ని రోజులు ఉండిపోవడంతో వారి ఆరోగ్య సమస్యలపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. తిరిగి వచ్చిన తర్వాత ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంటుందనే అంశంపైనా చర్చజరుగుతోంది. అంతరిక్షంలో ఎక్కువ కాలం ఉండటం వల్ల కళ్లు, హృదయనాళ వ్యవస్థ, ఎముకల సాంద్రత తదితర అంశాలపై ప్రభావం చూపే అవకశాం ఉందని చెబుతున్నారు. ముఖ్యంగా వ్యోమగాముల డీఎన్ఏ ముప్పు గురించి మాట్లాడుతున్నారు. స్పేస్ రేడియేషన్‌కు ఎక్కువసేపు గురైతే ఎర్ర రక్త కణాలు నాశనమవుతాయట. అంతరిక్షం శరీరంలోని ఎర్ర రక్తకణాలను సెకనుకు మూడు మిలియన్ల చొప్పున నాశనం చేస్తుందట. అంటేపఅంతరిక్ష యాత్రల సమయంలో వ్యోమగాముల శరీరాలు సెకనుకు మూడు మిలియన్ల ఎర్రరక్తకణాలను కోల్పోతుం దట. దీంతో సునీతా విలియమ్స్ ఆరోగ్య పరిస్థితిపై అనేక ఊహాగానాలు చెక్కర్లు కొడుతున్నాయి.

**పంచాంగం**

శనివారం 8-3-2025
క్రోధి నామ సంవత్సరము
ఉత్తరాణాయణం, శిశిరరుతువు
ఫాల్గుణ మాసం

| | |
|---|---|
| తిథి | : శు. నవమి ప. 8.17 |
| నక్షత్రం | : ఆరుద్ర రా. 11.29 |
| వర్జ్యం | : ఉ. 7.04 ల 9.30 |

## మీ కలాన్ని సంధించండి

కథలు, కవితలు, సాహిత్య, రాజకీయ విశ్లేషణలు, వ్యాసాలు, ప్రత్యేక కథనాలు, సందర్భోచిత కథనాలు... ఇలా ఏదైనా సరే.. రాసే ఆసక్తి ఉన్న వారు పంపవచ్చు. మీకు 'విశాఖ సమాచారమ్' దినపత్రిక చక్కటి వేదికగా నిలుస్తుంది. బాగున్న రచనలను మీ పేరు , ఫొటోతో సహా ప్రచురిస్తాము.

**మీ రచనలు పంపించవలసిన ఈమెయిల్ అడ్రస్**
**vspnews4@gmail.com**
**వాట్సాప్ నంబర్ : 9100986585.**

# ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీకి 'సుప్రీం' ముకుతాడు

## - మందుల కొనుగోలులో ఒత్తిడి పెడితే చర్యలు తప్పవు
## - ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలపై ఆగ్రహం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. విద్య, వైద్యం సామాన్యులకు అందించాల్సిన కనీస బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. అదినేడు పేదలకు, మధ్యతరగతి వర్గాలకు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి.ఫలితంగా ప్రైవేటు ఆస్పత్రులకు ఇది అవకాశంగా మారింది.వారు ఇష్టం వచ్చినట్లు దోచుకునే పరిస్థితులు ఏర్పడడంతో సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వాలకు చివాట్లు పెట్టింది.ప్రైవేటు ఆస్పత్రుల దోపిడి పై సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజనవ్యాజ్యం దాఖల్కెంది.ప్రైవేట్ ఆస్పత్రులు తాము నిర్వహించే మెడికల్ షాపుల్లో మందులు,మెడికల్ కేర్ వస్తువులు కొనమని పేషెంట్లను, వారి కుటుంబసభ్యులను ఒత్తిడి చేస్తున్నారని పిటిషర్ తన పిటిషన్లో పేర్కొన్నారు.మెడిషన్లు వాస్తవ ధరల కంటే అత్యధిక ధరకు విక్రయిస్తున్నారని,ఫలితంగా పేదరోగులు బలవుతున్నారని పిటిషనర్ తనవ్యాజ్యంలో ఆరోపించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు ఆస్పత్రులపై నియంత్రణ, దిద్దుబాటు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యాయని, వాటి ఫార్మసీలలో మందులు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేయకుండా తగిన జాగ్రత్తలు,చర్యలు తీసుకోవాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఆమేరకు అలా ఒత్తిడి తెచ్చే ఆస్పత్రులపై ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేసింది. బహిరంగ మార్కెట్ లో చవకగా మందులు దొరుకుతుంటే ప్రైవేట్ ఆస్పత్రులు వారి వద్దే కొనాలని ఒత్తిడి చేయకూడదని సూచించింది.ఈ అంశంపై కొన్ని రాష్ట్రాలకు కోర్టు నోటీసులు జారీ చేసింది.నోటీసులు జారీ చేసిన వాటిలో ఒడిశా, అరుణాచల్,చత్తీస్‌గఢ్, బీహార్, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్, రాజస్తాన్ లు ఉన్నాయి. కాగా ఆయా రాష్ట్రాలు కౌంటర్లు దాఖలు చేసాయి. మందుల ధరలు కేంద్రం జారీ చేసిన ధరల మేరకే అందుబాటులో ఉన్నాయని, ప్రైవేటు ఆస్పత్రులు ఒత్తిడి చేయడంలేదని కేంద్రం కోర్టుకు తెలిపింది.




కొన్ని రాష్ట్రాలు కాదు మొత్తం దేశంలో ప్రభుత్వ ఆస్పత్రులు పేదలకు సరైన వైద్యం అందించే పరిస్థితి లేదు.కాని పేదరిక రేఖ దిగువన ఉన్న కుటుంబాలకు ప్రభుత్వాలు ఆరోగ్య రక్ష వంటి పథకాలతో ప్రైవేట్ ఆస్పత్రులలోనూ వైద్యం చేయిస్తున్నాయి. ఆయా ఆస్పత్రులకు కోట్లాది రూపాయలు చెల్లిస్తున్నాయి. కాని మందులు కొనుగోలు విషయంలో కొంత అనుమానాలు ఉండవచ్చు.ప్రైవేటు ఆస్పత్రులు కూడా కొద్ది పాటి చికిత్సను కొండంత చూపుతూ ప్రభుత్వం చెల్లిస్తున్న నిధులను కొల్లకొడుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి.ఏదిఏమైనా ప్రభుత్వాలకు ప్రజల కనీసం అవసరాల్కెన విద్య,వైద్యం, మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ఉంది.ముఖ్యంగా ఆస్పత్రుల్లో పేదలకు ఉచిత వైద్యం అందించాల్సిఉంది. కాని ప్రభుత్వాలు ప్రజలకు అవసరమైన ఆస్పత్రులు ఏర్పాటు చేయడంలో ప్రైవేటు ఆస్పత్రులతో పోటీ పడలేకపోతున్నాయి. ప్రభుత్వ వైద్యులు అందుబాటులో లేకపోవడం కూడా ఒక కారణం.ప్రైవేటు ఆస్పత్రులు అన్ని సదుపాయాలు, వైద్య పరికరాలు సమకుర్చుకుని పోటీలో ముందున్నాయి. ప్రభుత్వాలు కూడా వాటిని ప్రోత్సాహం ఇవ్వడం జరుగుతున్నది.ప్రభుత్వాలు వాటికి రాయితీలు ఇస్తున్నాయి. ప్రతి ఆస్పత్రి ఫార్మసీలు ఏర్పాటు చేసుకుని అక్కడే మందులు కొనాలని ఒత్తిడి చేస్తున్నాయి. అలాగే రోగానికి కావలసిన మందులకన్నా ఎక్కువగా కొనిపించడం జరుగుతోందని ఆరోపణలు ఉన్నాయి.అలాగే పరిక్షల పేరుతో డబ్బులు గుంజుతున్నారనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. ప్రభుత్వాలు పిహెచ్ సి లను ఆధునీకరణ చేసి గ్రామాల్లో ప్రజలకు వైద్యం అందుబాటులోకి తేవాలి. అక్కడే చిన్న చిన్న రోగాలకు చికిత్స అందించాలి.మండల కేంద్రంలో ఏరియా ఆస్పత్రి ఏర్పాటు చేయాలి.అలాగే జిల్లాలో అత్యంత ఆధునికంగా సకల సదుపాయాలతో ఏర్పాటు చేసి వైద్యం అందించాలి. వీటిని పేదలు,మధ్యతరగతి వర్గాలకు అందుబాటులో ఉంచాలి. ఆదాయాలు బాగా ఉన్నవారు,ధనవంతులు, వ్యాపారులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లినా పర్వాలేదు. ముఖ్యంగా పేద,మధ్యతరగతి వర్గాలను ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకుని చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ వైద్యాధికారుల పదవులను ఖాళీ అవగానే తక్షణం భర్తీ చేయాలి.గతంలో ఏపీని తీసుకుంటే పేదమధ్యతరగతి వర్గాలు ప్రభుత్వ ఆస్పత్రులనే నమ్ముకునే వారు. గుంటూరు, కర్నూలు, ఖమ్మం, హైదరాబాద్ లలో ఆస్పత్రులు అందుబాటులో ఉండేవి. ప్రస్తుత కాలంలో అంతా కల్తీ మయం కావడం, రోగాలు దేశాలు దాటి క్షణాల్లో వ్యాపించడంతో కేవలం ప్రభుత్వ ఆస్పత్రులను మాత్రమే నమ్ముకుంటే సరిపోవడంలేదు.అలాగే జనాభా పెరగడం, మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఆస్పత్రులు ఏర్పాటు చేయడం జరుగుతోంది. చదువు పూర్తి చేసుకున్న వైద్యుల సంఖ్య కూడా ఏటికేడాది పెరుగుతోంది.ప్రైవేటు మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు సంఖ్య కూడా పెరుగుతోంది. రోగాలు పెరిగాయి. ప్రజల్లో ఆరోగ్యం పట్ల అవగాహన పెరిగింది. ఈ పరిస్థితుల్లో కేవలం ప్రభుత్వం ఆస్పత్రులను నెలకొల్పి వైద్యసేవ అందించడం కష్టం.కావున ప్రైవేటు ఆస్పత్రులకు అవకాశం ఇవ్వాలి. కాని అవి ప్రభుత్వ కంట్రోల్లో ఉండాలి. ప్రజలను అవి దోచుకునే అవకాశం ఇవ్వకుండా ఎప్పటికప్పుడు తగిన నియంత్రణ ఉండేలా యంత్రాంగం పెట్టుకోవాలి.ప్రభుత్వాలు పట్టించుకోకపోయినా,అవి ప్రభుత్వ నియంత్రణలో లేకపోయినా అత్యున్నత న్యాయస్థానం జోక్యం తప్పని సరి అవుతుంది.అలాంటి పరిస్థితి రాకుండా ప్రభుత్వాలు వాటిపై కన్నేసి ఉంచాలి.అప్పుడే పేద, మధ్యతరగతి బతుకుల్లో ఆరోగ్యం వెల్లివిరుస్తుంది.

(ఎం.వి.రామారావు, ప్రత్యేక ప్రతినిధి)

# యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం





నేడు ఎక్కువ మంది స్త్రీలు అనేక రకాల మానసిక ఒత్తిడులు, శారీరక రుగ్మతలకు గురవుతున్నారు. థైరాయిడ్, అధిక బరువు, బిపి, మోకాళ్ల నొప్పులు, మెడ, వెన్నెముక నొప్పులు, రుతు క్రమంలో అపసవ్యతలులాంటి అనేక సమస్యలకు తరచుగా గురవుతున్నారు. యోగసాధనతో వీటి నుంచి బయటపడి సంపూర్ణారోగ్యాన్ని మన సొంతం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

యోగాభ్యాసం మొదలుపెట్టే ముందు ముఖ్యంగా పాటించాల్సిన నియమాలు కొన్ని ఉన్నాయి. యోగసాధన చేసే ముందు మలమూత్ర విసర్జన తప్పనిసరి. యోగసాధనకు 20 నుంచి 30 నిముషాల ముందు మంచినీరు తాగటం అలవాటు చేసుకోవాలి. స్త్రీలు బహిష్టు సమయంలో యోగాభ్యాసం చేయకూడదు. ముఖ్యంగా ప్రశాంతమైన మనసుతో చేయాలి. మనసులో ఒత్తిడులు, కోపం, భయం, అయిష్టత, మొదలైనవి ఉన్నపుడు యోగసాధన చేయకూడదు. జ్వరంతో ఉన్నపుడుగాని, అధిక బి.పి ఉన్నపుడుగాని ఆసనాలు అసలు వేయకూడదు. యోగా చేయడానికి ముందు కాఫీ, టీల లాంటివి తీసుకోకూడదు. శరీరాన్ని పట్టి ఉండే బిగుతైన దుస్తులు ధరించకూడదు. సాధ్యమైనంత వరకు వదులుగా ఉండేలా కాటన్ దుస్తులు వేసుకోవాలి. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు అనుభవజ్ఞులైన యోగ శిక్షకుల సమక్షంలో యోగా భ్యాసం చేయటం మంచిది. శబ్దకాలుష్యం, వాయుకాలుష్యంలేని ప్రదేశాన్ని ఎంపిక చేసుకోవాలి యోగసాధన చేయాలి. గాలి, వెలుతురు ఉండే విశాలమైన గదిలోగాని, ఆరుబయట గాని మేడపైన గాని యోగాభ్యాసం చేయాలి. ఉదయం, సాయంత్ర సమయాల్లో రెండు సార్లు యోగసాధన చేయాలి.

బ్రహ్మ ముహూర్త సమయంలో ధ్యానం చేయటం చాలా మంచిది. యోగా చేసేవారు చలికాలంలో గోరువెచ్చని నీటిని తాగాలి. యోగసాధనకు భోజనానికి మధ్య ఐదు నుంచి ఆరు గంటల వరకు కాలవ్యవధి ఉండాలి. అంటే భోంచేసిన ఐదు లేదా ఆరుగంటలలోపు యోగా చేయకూడదు. అనుభవజ్ఞులైన శిక్షకుల సమక్షంలో యోగా భ్యాసం నేర్చుకున్న తరువాతే స్వయం సాధన చేయటం చాలా మంచిది. నేలమీద యోగసాధన చేయకూడదు. మెత్తని బెడ్‌షీట్ గాని కార్పెట్‌గాని వేసుకోవాలి. గర్భిణులు ప్రాణాయామం, సూక్ష్మ వ్యాయామం మాత్రమే చేయవచ్చు. ఆసనాలు వేయకూడదు. వీరికి నడక చాలా మంచిది. యోగసాధన సమయంలో మధ్యలో నీళ్ల తాగకూడదు. యోగసాధనకు 20 నిముషాల ముందుగాని లేదా పూర్తయిన 20 నిముషాలకు తరువాత గాని తాగాలి. యోగాసనాలు క్రమపద్ధతిలో వేయాలి. ముందుగా సూక్ష్మవ్యాయామంతో ప్రారంభించి ఆసనాలు, సూర్యనమస్కారాలు, ప్రాణాయామం తదుపరి ధ్యానంతో ముగించాలి. ఏవైనా శారీరక రుగ్మతల కారణంగా కింద కూర్చోలేని వారు ఏదైనా బల్లపై కూర్చుని యోగసాధన చేయాలి. కనుక క్రమపద్ధతిలో యోగా చేసి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి.

- యామిజాల జగదీశ్ (కవి, రచయిత, సీనియర్ జర్నలిస్ట్

# మహిళా లోకానికి ఆదర్శం న్యాయమూర్తి శ్రీపతి



టీనేజ్ అమ్మాయికి నల్లకోటు వేసినట్టు ఉన్న ఈ అమాయకపు అమ్మాయిని తదేకంగా మళ్ళీ మళ్ళీ చూడండి. ఈమె పేరు శ్రీపతి... చెన్నై నుండి 250 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరువన్నామలై దగ్గర జువ్వాది పర్వతశ్రేణుల మధ్య ఉన్న గిరిజన గూడెం వాళ్ళది. తండ్రి కాళిదాస్, తల్లి మల్లిక. కొండప్రాంతంలో పోడు వ్యవసాయం చేసేవాళ్ళు... శ్రీపతి కి ఒక చెల్లెలు, ఒక తమ్ముడు ఉన్నారు.

పిల్లల చదువుకోసం ఆ కుటుంబం దగ్గరలోని 'అత్నావర్' అనే పల్లెకు వలస వచ్చింది వీరి కుటుంబం. ఇక్కడా ప్రధానంగా పోడు వ్యవసాయమే. అయినా పిల్లలు చదువుకోడానికి మంచి స్కూల్ ఉందని సంతోషించారు. కాళిదాస్ టూరిస్ట్ ప్రదేశాల్లో హౌజ్ కీపింగ్ లాంటి పనులకు కుదురుకున్నాడు.

వాళ్ళది 'మలయలి' అనే అత్యంత వెనుకబడిన గిరిజన తెగ... ఆ తెగలో అమ్మాయిలను చదివించడం, బయటకు పంపడం పట్ల అనేక ఆంక్షలు ఉంటాయి. కాళిదాస్, మల్లిక దంపతులు వీటిని ఏమీ పట్టించుకోలేదు. శ్రీపతి చదువులో మెరుగుగా రాణిస్తూ.. అందరికంటే ముందు ఉండడం, ఉన్నత చదువులు చదువు తాను అని పట్టుబట్టడంతో ఆమెను తిరువణ్ణామలైలో "లా" కోర్సు చదివించారు.

బంధువుల ఒత్తిడి కారణంగా శ్రీపతికి వెంకట్రామన్ అనే యువకుడితో వివాహం జరిపించారు. పెళ్ళైనా శ్రీపతి చదువు మాత్రం ఆపలేదు. డాక్టర్ అంబేద్కర్ లా విశ్వవిద్యాలయం లో పీజీ చేశారు. వెంటనే జూనియర్ సివిల్ జడ్జ్ పరీక్షకు అప్లై చేశారు. అయితే పరీక్షకు అప్లై చేసేనాటికే తాను గర్భవతిని అని తెలిసింది. సరిగ్గా పరీక్ష తన డెలివరీ ఒకేసారి అయ్యేలాగా ఉందని ఆందోళన చెందింది. అయితే తల్లిదండ్రులు, తన ఫేవరెట్ టీచర్ మహాలక్ష్మి , భర్త వెంకట్రామన్ ధైర్యం చెప్పారు. చదువుకోవడం పట్ల దృష్టి పెట్టు అంతా మంచే జరుగుతుందని సర్ది చెప్పారు.

శ్రీపతి తదేక దీక్షతో పరీక్షలకోసం పట్టుదలగా చదివింది. తల్లి మల్లిక అనుక్షణం శ్రీపతి ని కనిపెట్టుకుని ఉంది. పరీక్ష రాయాల్సిన డేట్ వచ్చేసింది. డెలివరీకి వెళ్ళేముందు కూడా పుస్తకాలు చదవడం వదలలేదు శ్రీపతి.

2023 నవంబర్ 27 న శ్రీపతి చక్కటి పాపకు జన్మనిచ్చింది. నవంబర్ 29 న పరీక్ష. రెండ్రోజుల బాలింత. పరీక్ష రాయల్సిన చోటు.. 250 కిలోమీటర్ల దూరంలో ఉన్న చెన్నైలో... అయినాసరే పరీక్ష రాస్తానని పట్టుబట్టింది. డాక్టర్లు వారించినా వినలేదు. తన శ్రమ వృధా కాకూడదని వేడుకుంది. తల్లిదండ్రులు భర్త సహకారంతో పసిగుడ్డుతో ప్రయాణం చేసి పరీక్ష వ్రాసింది. సెలెక్ట్ అయ్యింది. టిఎన్ పీఎస్సీ లో ఇంటర్వ్యూ కు అటెండ్ అయ్యింది. మొన్ననే... ఫిబ్రవరి 15, 2024 నాడు జూనియర్ సివిల్ జడ్జ్ గా, బి"మొట్టమొదటి గిరిజన మహిళగా"బి అపాయింట్మెంట్ ఆర్డర్ అందుకుంది.

అకుంఠిత దీక్షతో, ఎన్ని అవాంతరాలు ఎదురైనా ధైర్యంగా తట్టుకొని చదివి , విజయాన్ని అందుకున్న బి"ఈ బంగారు తల్లి శ్రీపతి విజయగాథ"బి ఆమెలాంటి వందల మందికి ఆదర్శం కావాలి.

-సుగుణ శేఖర్‌రెడ్డి గుమ్మళ్ల

# బతుకు పోరులో విజయం

## మహిళా దినోత్సవానికి అయిదుగురికి ఆహ్వానం



విజయనగరం, విశాఖ సమాచారమ్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను పలువురు సద్వినియోగం చేసుకుని కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. అలాంటి వారిలో అయిదుగురు ఈనెల 8న మార్కాపురంలో జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొననున్నారు.

విజయనగరం వంగర మండలం కొప్పరకు చెందిన లగ్గు మౌలికకు భర్త, ఇద్దరు పిల్లలున్నారు. కొన్నాళ్ల కిత్రం రూ.8.50 లక్షల రుణంతో ఇళ్లు శుభ్రం చేసే పరికరాల యూనిట్, మినపగుళ్ల తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో స్టాళ్లను నిర్వహిస్తున్నారు. నెలకు రూ.2.10 లక్షల టర్నోవర్ జరుగుతోందని, అయిదుగురికి పని కల్పిస్తున్నానని ఆమె తెలిపారు. ఖర్చులన్నీ పోనూ రూ.55 వేల వరకు మిగులుతోందన్నారు.

విజయనగరం మండలం రామజోగిపేటకు చెందిన కొత్తపల్లి రమ ఉన్నత చదువులు చదివారు. స్వయం ఉపాధి పొందాలని భావించి బ్యుటీషియన్‌గా మారారు. మరోవైపు టైలరింగ్ కోర్సు చేశారు. వివిధ రకాల పథకాలను వినియోగించుకుని సంబంధిత యంత్రాలను కొనుగోలు చేశారు. ప్రస్తుతం రోజుకు రూ.2 వేల వరకు సంపాదిస్తున్నానని రమ తెలిపారు.

గజపతినగరం మండలం పురిటిపెంటకు చెందిన దాలి సరస్వతి భర్త మరణించారు. ఈక్రమంలో ఇద్దరు పిల్లల పోషణ ఆమెకు భారంగా మారింది. వెనకడుగు వేయకుండా రూ.7 లక్షల రుణంతో పూల వ్యాపారం ప్రారంభించారు. అనంతరం కుమారుడి సహాయంతో భవన నిర్మాణానికి సంబంధించిన సెంట్రింగ్ విభాగంలోకి వచ్చారు. అన్ని ఖర్చులు పోగా నెలకు రూ.50 వేల వరకు ఆదాయం పొందుతున్నానని, కుమార్తె వివాహం చేశానని సరస్వతి తెలిపారు.

## 10న హేమగిరి సత్యనారాయణ స్వామి కళ్యాణ మహోత్సవం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** శ్రీ రమా లక్ష్మీ సమేత శ్రీ సత్యనారాయణ స్వామి వారి కళ్యాణం (హేమగిరి సత్యనారాయణ స్వామి) ఈనెల 10వ తేదీ ఏకాదశి సోమవారం సాయంత్రం 6 గంటలకు జరుగు కార్యక్రమానికి ఈరోజు ఆహ్వాన పత్రాన్ని దేవస్థానం చైర్మన్ అప్పికొండ గణేష్ ధర్మకర్తలు పాలమరశెట్టి నూకరాజు పప్పల రామకృష్ణ తదితరులు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావుకు శ్రీ భోగలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ కు ఆహ్వాన పత్రికను అందించి స్వామివారి కల్యాణంలో భాగస్వామ్యం కావాలని, ఆహ్వానించారు. అలాగే భారీ అన్న సమారాధన ఏర్పాటు చేస్తామని ఈ కార్యక్రమంలో కూడా పాల్గొని భక్తులకు మీ సేవలు అందించాలని చైర్మన్ గణేష్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ భోగ లింగేశ్వర దేవస్థానం డైరెక్టర్ పెంటకోట గణేష్ కుమార్ ,కాండ్రేగుల రవీంద్ర, యలమంచిలి బంగారు రాజు ,కాళ్ళ నాయుడు విల్లూరి సత్తిబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గిరిజనులకు టార్పలిన్ పట్టాలు పంపిణీ



**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** జి మాడుగుల గిరిజన సహాకార సంస్థ బ్రాంచి మేనేజర్ ఎన్.కొండబాబు అధ్వర్యంలో చిన్న బంధవీది, జి.మాడుగుల, నేరేడువలస, అరగడపల్లి, కొరాపల్లి గ్రామంలో కాఫీ రైతులకు ఉచితంగా టార్పన్ పంపిణీ చేశారు, గిరిజన సంహారక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కల్పన కుమరి గిరిజన సహాకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అదేశలు మేరకు 100 కేజీ కాఫీ జిసిసికి అమ్మకాల చెసి రైతులకు మాత్రమే టార్పన్ పంపిణీ చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో సెల్స్ మెన్ల్ గండేరు నిరీక్షణ రావు,లంకెల కళ్యాణ్, పంతులు నాయుడు, పాల్గొన్నారు.

## కష్టసమయంలోనే గుండె నిబ్బరం అవసరం

### పిల్లి సత్యనారాయణ కుటుంబీకులను ఓదార్చిన ఎంపీపీ రమేష్



**కొయ్యూరు, (విశాఖ సమాచారమ్):-** ఎటువంటి మనిషికైనా, ఇటువంటి కుటుంబానికైనా కష్టాలు తప్పవని, అటువంటి సమయంలోనే గుండె నిబ్బరం అవసరమని ఎంపీపీ బడుగు రమేష్ బాబు అభిప్రాయపడ్డారు. ఇటీవల మృతి చెందిన మండలంలోని రేవల్ల గ్రామానికి చెందిన పిల్లి సత్యనారాయణ కుటుంబాన్ని గురువారం సాయంత్రం ఎంపీపీ రమేష్ పరామర్శించారు. మృతుడు సత్యనారాయణ భార్య లక్ష్మి, కుమారులు వసంత్ కుమార్, శ్రీను లను ఎంపీపీ రమేష్ బాబు ఓదార్చే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం నుండి అందాల్సిన సామాజిక పెన్షన్ తదితర అర్హత కలిగిన ఎటువంటి సాయానికైనా తన వంతు కృషి చేస్తానని ఎంపీపీ రమేష్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాగేంద్ర, బూరుగు కుశల, మాజీ సర్పంచ్ కొండపల్లి దేవుడు, టిడిపి నేత మట్టపర్తి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## 30 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్టు

**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** మండల కేంద్రమైన జి మడుగు ల కొత్తూరు జంక్షన్ వద్ద శుక్రవారం నాడు వాహనాలు తనిఖీ చేస్తుండగా 30 కిలోల గంజాయి పట్టుబడి నట్లు ఎస్ ఐ షణ్ముఖ రావు తెలిపారు.జి. మాడుగుల మండలం వంజరి పంచాయతీ గొప్పులపాలెం గ్రామానికి చెందిన గొల్లోరి పాడలం( 53)ను గంజాయి తో అరెస్టు చేశామని తెలిపారు. గంజాయి విలువ లక్ష 50వేలు. రూపాయలు ఉంటుందని కేసు నమోదు చేసి రిమాండ్ తరలించమని ఎస్ ఐ షణ్మక రావు తెలిపారు. తనిఖీలో సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

## 12 న ఛలో విజయవాడను జయప్రదం చేయండి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** అలవెన్స్, పే స్లిప్పులు పెండింగ్ బకాయిలు చెల్లింపులు వంటి డిమాండ్ల సాధన కోరకు ఈనెల 12 న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం అనకాపల్లి జిల్లా కమిటీ పిలుపు నిచ్చింది. శుక్రవారం అనకాపల్లి, దొడ్డి రామునాయడు భవన్ లో సంఘం జిల్లా కమిటీ సమావేశం, జిల్లా.అధ్యక్షులుయం.సత్యనారాయణ అద్యక్షతన జరిగింది. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి వెంకన్న మాట్లాడారు,పెండింగ్ బకాయిలు చెల్లింపులు సమ్మర్ అలవెన్సులు పే స్లిప్పులు ఇవ్వక పోవడంతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

వ్యవసాయ కార్మికులు పనులు లేక ఉపాధి పనులు సరిపడక ప్రతి రోజు వేలాది మంది ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి లక్ష లాది మంది సుదూర ప్రాంతాలకు నెలలు తర బడి వలసలు పోతున్నారని తెలిపారు. ప్రమాదంలో ప్రతి నిత్యం పదుల సంఖ్యలోకూలీలు.చని పోతున్నారని అన్నారు చదువులు కోల్పోయి,వారి పిల్లల భవిష్యత్తు మొగ్గలోనే తుంచి వేయబడుతుంది అని అన్నారు .పేదల కోసం తెచ్చిన ఉపాధి హామీ చట్టం అమలు చేయడంలో చాలా లోపాలు న్నాయని తెలిపారు కుటుంబంలో ముగ్గురు, నలుగురు పని చేయడం వల్ల 100 రోజులు త్వరగా పూర్తవుతన్నాయని తెలిపారు వేసవికాలంలో. నేల గట్టిగా మారి కూలి గిట్టుబాటు కావడం లేదన్నారు.గతంలో ఇస్తున్న సౌకర్యాలన్ని ఆపే శారని తెలిపారు. ఉపాధిలో రాజకీయ జోక్యం పెరగడం వల్ల కూలీలకు అన్యాయం జరుగుతుందన్నారు. పేదలకు వరం లాంటి ఉపాధి హామీ చట్టాన్ని అధికారులు, రాజకీయ నాయకులు కుమ్మక్కై చట్ట స్ఫూర్తిని నీరు గారుస్తున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. కాబట్టి ఈ క్రింది డిమాండ్ల పరిష్కారం కోసం ఉపాధి హామీ అమలు కోసం చట్టాన్ని ఆదర్శవంతమైన అమలుకై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు .

.ప్రభుత్వం దృష్టికి తీసుకు రావడానికి మార్చి 12 వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ లో పెద్ద ఎత్తున ఆందోళన జరుగుతుందని తెలిపారు 100 రోజులు ఉపాధి పని పూర్తి చేసుకున్న గ్రామీణ పేదలకు అదనంగా పని దినాలు,పెంచాలని

సమ్మర్ అలవెన్స్ 30% కలపాలని ప్రతివారం పే స్లిప్ప, పనిముట్లు, మంచినీళ్ళకు రూ.5/-లు ఇవ్వాలి. మేట్లకు ప్రతి కూలిపై రూ.5/-లు పారి తోషికం ఇవ్వాలని.ఉపాధి హామీలో యంత్రాలు, కాంట్రాక్ట్ విధానం రద్దు చేయాలి. వ్యవసాయానికి అనుసంధానం చేయరాదని అవినీతిని అరికట్టాలని.మస్టర్లను ఉపాధి సిబ్బందికి మాత్రమే ఇవ్వాలని రాజకీయ జోక్యం ఉండరాదని,వలస కార్మికులకు గుర్తింపు కార్డు లిచ్చి ఉచితంగా రవాణా సౌకర్యం, బియ్యం,గ్యాస్ బండ అందించాలని ప్రమాదాల్లో చనిపోయిన కుటుంబాలకు భీమా సౌకర్యం రూ.25 లక్షల నగదు, రెండెకరాల భూమి ఇవ్వాలని ప్రతి పేద కుటుంబానికి ఏడాదికి రూ.12000/-లు కూలి బందు పథకం క్రింద నగదు ఇవ్వాలని.

3 సెంట్లు స్థలం, ఇంటి నిర్మాణానికి 6 లక్షల నగదుతో పాటు ప్రతి దళిత కాలనీకి 2 ఎకరాల స్మశాన స్థలం ఇవ్వాలని డిమాండ్లుతో ఛలో విజయ వాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు ఈకార్యక్రమం జయప్రదం కోసం జిల్లా నుండి అదిక సంఖ్యలో కూలీలు కదిలి రావాలని వారు పిలుపు నిచ్చారు ఈ కార్య క్రమంలో కె భవాని ఇరట నరసింహా మూర్తి బిటి దోర సాంభ శివరావు, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.


ఈస్ట్ కోస్ట్ రైల్వే

టెండరు ప్రకటన నెం. WAT-TRD-94-24-25, తేది. 28.02.2025

పని పేరు మరియు ప్రదేశం: వాల్తేరు డివిజన్‌లో మెయిన్ లైను నందు ప్రస్తుతమున్న కాలంచెల్లిన త్రుప్పు పట్టిన కాంటిలివర్ అసెంబుల్స్ రీప్లేసుమెంట్ చేయుట. ఫేజ్-VI.

టెండరు విలువ: ₹ 1,04,93,990.32, బయానా: ₹ 2,02,500/-. పని పూర్తి చేయు కాలం: 9 నెలలు.

టెండరు ముగింపు తేదీ మరియు సమయం: 24.03.2025న 1500 గంటలకు.

పూర్తి సమాచారం లభించు వెబ్‌సైట్: www.ireps.gov.in

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీరు (TRD), వాల్తేరు

PR-1051/P/24-25


## గిరిజన ఆవాసాల్లో బస చేయడానికి ప్రతిపాదనలు

### జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్

**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** పర్యాటకులు గిరిజన అవాసాల్లో బస చేయడానికి (హెూమ్ స్టే) ప్రతిపాదనలు సిద్ధం చేసి ఈనెల 15 వ తేదీలోగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం తాహశీల్దారులు, ఎంపిడి ఓలు, పర్యాటక శాఖ, అటవీ శాఖ అధికారులతో పర్యాటక అభివృద్ధి లో భాగంగా గిరిజన ప్రాంతాలలో పర్యాటకులు హెూమ్ స్టే ఏర్పాట్ల పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయ సంఘాలు, గ్రామైఖ్య సంఘాల ఆధ్వర్యంలో హెూమ్ స్టేలు ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. హెూమ్ స్టేల ద్వారా గిరిజనులకు ఆర్థికంగా ఆదాయం పొందుతారన్నారు. సామాజిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. రంపచోడవరం డివిజన్లలో గుడిసె, మారేడు మిల్లి అరకు వ్యాలీ మండలం పెదలబుడు, చొంపి, మాడగడ గ్రామాల్లో హెూమ్ స్టేలు ఏర్పాటు చేయడానికి పరిశీలించాలన్నారు. చింతూరు డివిజన్లో గిరిశిఖర గ్రామాలను గుర్తించాలన్నారు. చింతపల్లి మండలంలో తాజంగి, లంబసింగి గ్రామాలను పరిశీలించాలని ఎంపిడిఓ ను ఆదేశించారు. టూరిజం ప్రాంతాలలో స్వచ్ఛాంధ్రా కింద సామాజిక మరుగుదొడ్లు నిర్మించడానికి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. షెడ్యూలు ఏరియా లోని పర్యాటక ప్రాంతాలు కలుషితం కాకుండా ఏప్రిల్ నుండి ప్లాస్టిక్ను నిషేధిస్తామన్నారు. ప్లాస్టిక్ బాటిల్స్ను అనుమతించమన్నారు. ప్లాస్టిక్ నిషేదం పై చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు. సచివాలయం

సిబ్బంది, పంచాయతీ సిబ్బంది తనిఖీలు చేసి ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించాలన్నారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, రంపచోడవరం పి ఓ కె. సింహచలం (పర్చువల్) డిఆర్ డి ఏ పిడి వి. మురళి, సిపి ఓ ఎస్. ఎస్. ఆర్. కె. పట్నాయక్, డిటి ఓ దాసు, అరకు వ్యాలీ మ్యూజియం క్యూరేటర్ మురళి, 22 మండలాల ఎంపిడిఓలు, తాహశీల్దారులు, ఇ ఓ పి ఆర్ డిలు, ఎపి ఎఫ్ డిసి, అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## టెక్ మెట్ ఇన్స్టిట్యూట్ ప్రారంభం

**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):-** పెద్ద బొడ్డేపల్లిలో టెక్ మెట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్‌ను టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా చింతకాయల విజయ్ మాట్లాడుతూ, నర్సీపట్నంలో టెక్ మెట్ ఇన్స్టిట్యూట్ ఏర్పాటు కావడం ఆనందంగా ఉందని, ఇది స్థానిక యువతకు ఎంతో ప్రయోజనం కలిగిస్తుందని పేర్కొన్నారు. ఈ ఇన్స్టిట్యూట్‌లో శిక్షణ పొందిన వారికి సర్టిఫికేట్‌తో పాటు వివిధ ప్రముఖ కంపెనీలలో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ఇలాంటి శిక్షణ కేంద్రం లేకపోవడంతో యువత ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు నర్సీపట్నంలోనే ఈ సదుపాయం అందుబాటులోకి రావడం ఎంతో మంచి పరిణామమని అన్నారు.2014-19 కాలంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం బొడ్డేపల్లిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, అవసరమైన పరికరాలను సమకూర్చి యువతకు శిక్షణ ఇచ్చిందని, ఆ శిక్షణ పొందిన ఎంతో మంది యువతీయువకులు మంచి ఉద్యోగాలను



పొందారని వివరించారు. ఇప్పుడు నర్సీపట్నంలో టెక్ మెట్ ఇన్స్టిట్యూట్ ప్రారంభమవడం ద్వారా మరింత మందికి ప్రయోజనం కలుగుతుందని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నర్సీపట్నం యువత కోసం ఈ ఇన్స్టిట్యూట్‌ను ప్రారంభించిన మేనేజ్మెంట్ డైరెక్టర్ మల్ల నాగేశ్వరరావుకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొడ్డేపల్లి ప్రాంతానికి చెందిన కౌన్సిలర్ రాజు నాయుడు, మాజీ కౌన్సిలర్ రెడ్డప్ప నాయుడు, దాసు, దశరథ్, టిడిపి నాయకులు, అనేక మంది ప్రముఖులు, యువత పాల్గొన్నారు.

## ఎంపీ సీఎం రమేష్ అధ్యక్షతన రైల్వే పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** ఢిల్లీ కేంద్రంగా రైల్వే పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్,అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం రమేష్ అధ్యక్షతన పార్లమెంట్లో శుక్రవారం రైల్వే బోర్డు కమిటీ సభ్యులు మరియు రైల్వే ఉన్నతాధికారులతో (2024-25) సంవత్సరానికి సంబంధించి గ్రాంట్ల డిమాండ్ల యొక్క మొదటి నివేదిక పరిశీలన అనంతరం ప్రభుత్వం తీసుకున్న చర్యలు గురించి మరియు వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబందించిన రైల్వే మంత్రిత్వ శాఖ యొక్క గ్రాంట్స్ డిమాండ్లు గురించి కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు.

## ఉపమాక బందోబస్తు ఏర్పాట్లపై సమీక్ష



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):-** ఈనెల 9వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఉత్తరాంధ్ర కలియుగ దైవం ఉపమాక కల్కి వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలకు సంబంధించి, బందోబస్తు ఏర్పాట్లను నర్సీపట్నం డివిజనల్ పోలీస్ అధికారి పోతిరెడ్డి శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఈనెల 10వ తేదీన అంగరంగ వైభవంగా జరిగే వెంకటేశ్వర స్వామి కళ్యాణానికి సంబంధించిన ఏర్పాటు పై పూర్తిస్థాయి వివరాలను సీఐకే కుమార్ స్వామి తెలియజేశారు. ఈ మేరకు కళ్యాణం జరిగే కళ్యాణ వేదిక రథోత్సవం తిరిగే తిరువీధులు ఎదురు సన్నాహ మహెూత్సవ కార్యక్రమం తోపాటు బందు సరస్సులో పుణ్యస్నానాలు ఆచరించే బంధురు సరస్సును అక్కడ జరుగుతున్న ఏర్పాట్లు ఉత్సవాలకు వచ్చే భక్తులు రహదారి మార్గాలు పార్కింగ్ ప్రదేశాలను పూర్తిస్థాయిలో పరిశీలించారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కాకుండా సక్రమంగా కళ్యాణ ఉత్సవాలు జరిగేటట్లు చూసుకోవాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకూడదని, విఐపి లు వచ్చేటప్పుడు వారి రహదారి మార్గాల్లో చేరుకునే విధానం ఎక్కడ కూడా భక్తులకి ఇబ్బంది కలగకూడదని, ఆ విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కళ్యాణ ఉత్సవాలకు సంబంధించి టిటిడి అధికారులతో పాటు ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులతో అడిగి తెలుసుకున్నారు .ఆయనతోపాటు ఎస్. రాయవరం సిఐ లద్దు రామకృష్ణ, ఎస్సై సన్నీ బాబు ఉన్నారు.

## కెమికల్ ట్యాంకర్ బోల్తా



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):-** మండలంలోని దేవవరం శివారు ఒడ్డిమెట్ట జాతీయ రహదారిపై అదుపుతప్పిన కెమికల్ ట్యాంకర్ బోల్తాపడడంతో చాకచక్యంగా వ్యవహరించిన డ్రైవర్ వలన పెద్ద ప్రమాదం తప్పింది.! కాకినాడ జిల్లా తుని నుంచి పరవాడ ఇసోటోన్ కెమికల్ తో వెళుతున్న ఈ ట్యాంకర్ బోల్తా పడింది. కెమికల్ ట్యాంకర్ కావడంతో విషయం తెలుసుకున్న సీఐ కే. కుమార్ స్వామి హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకొని ఫైర్ సిబ్బందిని అప్రమత్తం చేసి ఎటువంటి ప్రమాదం లేకుండా చర్యలు చేపట్టారు. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

## సమత కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** సమత కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు అన్ని రంగాలలో పురుషులతో పాటు సమానంగా రాణిస్తున్నారు, కానీ ఇంకా కొన్ని చోట్ల మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయి అని వీటికి దీటుగా ఎదుర్కొనవలసిన ఆవశ్యకత ఎంతైనా మహిళలకు ఉందని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి బి.జె.పి స్టేట్ ఎగ్జిక్యూటివ్ స్పోక్ పర్సన్ సుహాసిని ఆనంద్ కొమరగిరి తెలియజేశారు. అనంతరం గౌరవ అతిథిగా విచ్చేసినటువంటి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ అన్నెపు నరసింహమూర్తి గారు మాట్లాడుతూ ముఖ్యంగా కాలేజీలో చదువుతున్న విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మోసాలు బారిన పడకుండా బాగా చదువుకోవాలని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసినటువంటి కళాశాల డీన్ & కరస్పాండెంట్ ప్రొఫెసర్ ఎస్. విజయ రవీంద్ర మాట్లాడుతూ నవ సమాజ స్థాపనలో మహిళల పాత్ర ఎంతైనా ఉందని, ఈమధ్య మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను ఎదుర్కొనే సమయం ఆసన్నమైనది అని పిలుపునిచ్చారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ & డైరెక్టర్ జి. శ్రీనివాసరావు మాట్లాడుతూ మనిషి మనుగడకోసం స్త్రీ అవసరాన్ని గుర్తించిన రోజుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని అభివర్ణించారు. అనంతరం విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## 9, 10 తేదీల్లో ఏపీ, తెలంగాణ వయోజన విద్య విశ్రాంతి ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- ఆంధ్రప్రదేశ్ తెలంగాణ వయోజన విద్య విశ్రాంత ఉద్యోగుల సంఘం కుటుంబాల రెండవ ఆత్మీయ సమావేశం ఈనెల 9 10 తేదీల్లో విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీ ప్లాటినం జూబ్లీ గెస్ట్ హౌస్ లో నిర్వహిస్తున్నట్టు కార్యక్రమం ఆహ్వాన సంఘం ప్రతినిధి విశ్రాంత ఉపసంచాలకులు వయోజన విద్య అప్పల బత్తుల నాగేశ్వరరావు తెలిపారు. వయోజన విద్య విశ్రాంత ఉద్యోగులు ఒకచోట కలవాలనే సంకల్పంతో విశాల దృక్పథంతో 2023 ఏప్రిల్ 14 తేదీల్లో యాదగిరిగుట్ట వద్ద ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో 170 మంది గౌరవ సభ్యులు వస్తున్నట్టు నమోదు కాగా అందులో 90 మంది జీవిత సహచరులతో హాజరయ్యారని ఆయన తెలిపారు. అదే స్ఫూర్తితో ఈ ఏడాది విశాఖలో సంఘ సంఘ సభ్యులు కుటుంబ సమేతంగా ఆత్మీయ సమ్మేళనంలో కలవాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు అప్పల బత్తుల తెలిపారు. తొమ్మిదో తేదీన ఆత్మీయ సమ్మేళనం పదో తారీకున సింహాచలం శ్రీ వరహాలక్ష్మీ నృసింహస్వామి దర్శనం కార్యక్రమాల్ని ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. సంఘ సభ్యులందరూ హాజరుకావాలని ఈ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాలు విజయవంతం చేయాలని నాగేశ్వరరావు కోరారు.

## రెండో రోజుకు ఆత్మ గౌరవ దీక్షలు



జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):- అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రమైన పాడేరు ఐటీడీఏ కార్యాలయం ఎదుట చేపట్టిన ఆదివాసి ఆత్మ గౌరవ దీక్షలు రెండో రోజు కు చేరాయి. పలు ప్రధాన డిమాండ్లతో ప్రారంభించిన దీక్ష రెండో రోజు చేరింది. ఈ దీక్షలు చేపట్టిన గిరిజన సంఘాల నాయకులు దండకారణ్య విమోచన సమితి కేంద్ర కమిటీప్రతినిది. సమిరెడ్డి మాణిక్యం తో పాటుమద్దతుగా శుక్రవారంనాడు వైసిపి నాయకులు కురుసా పార్వతమ్మ. సుబ్రహ్మణ్యం గసాడి చంద్రశేఖర్. సిపిఎం నాయకులు అరకు మాజీ జెడ్పిటిసి కిల్లో సురేంద్ర అప్పల నరసయ్య గిరిజన సంఘం సిపిఎం నాయకులు అలాగే వైసిపి నాయకులు మద్దతుగా దీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కూడా రామకృష్ణ వ్యవహరించారు.

## వాలంటీర్ల దీక్షకు మద్దతు : ప్రియాంక దండి



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- గ్రామ సచివాలయ వాలంటీర్స్ ఈరోజు ఆర్ టీ సి కాంప్లెక్స్, గాంధీ విగ్రహం వద్ద చేస్తున్న ధర్నాకు కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గం ఇంచార్జ్ ప్రియాంక దండి మద్దతు తెలిపారు. ప్రియాంక మాట్లాడుతూ ఎన్నికల ముందు గ్రామ సచివాలయ వాలంటీర్లకు కూటమి ఇచ్చిన హామీలను వెంటనే నిరవేర్చాలని ఆమె డిమాండ్ చేసారు. వెంటనే వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని, వారి జీతం 10 వేలకు పెంచాలని డిమాండ్ చేసారు,వారి ఆవేదన ప్రభుత్వం వినాలని ఆమె విజ్ఞప్తి చేసారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు కాండవ గాయత్రి, నాగరాజు, అనిల్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## క్షయ రహిత పంచాయతీగా ఆర్. భీమవరం



బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):- మండలంలోని తురకలపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆర్. భీమవరం క్షయ రహిత పంచాయతీగా టి. బి. ముక్త భారత్ లో భాగంగా ఎంపిక అయిన సంధర్భంగా జిల్లా లెప్రసీ, క్షయ అధికారి డా.ఏం. ఎస్. వి. కె. బాలాజీ వారి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా సభ్యులతో తురకలపూడి వైద్యాధికారిణి డి. సంధ్య రాణి అధ్యక్షతన పిహెచ్సి లో సమావేశం నిర్వహించారు. క్షయ రహిత పంచాయతీగా ఆర్. భీమవరం గ్రామాన్ని కేంద్రం ఎంపిక చేసినందుకు డా. బాలాజీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశములో ఈ నెల 24 వ తేదీ న కేంద్ర బృందం పర్యటించుటకు ముందుగా తగిన సూచనలను సలహాలను సంబందిత సిబ్బందికి తెలియజేశారు. ఈ నెల 24 న టిబి డే కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతులమీదుగా అవార్డు ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ అయ్యపు రెడ్డి, పెంటయ్య, కార్యదర్శి కె. ప్రభాకర్ ఆరోగ్య విస్తరణ అధికారి కె. వి. రాజశేఖర్, ఫార్మసీ అధికారి చంద్రమౌళి, పిహెచ్ఎన్ సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక



నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):- మండలంలోని ఎంపీడీవో ఆఫీసులో శుక్రవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక ఎంపీపీ సుర్ల రాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. నర్సీపట్నం మండలంలో 2024-25 చేసిన ఉపాధి హామీ పథకం కింద నర్సీపట్నం మండలంలో ఉన్న 12 గ్రామపంచాయతీలో జరిగిన పనులు గురించి ఆడిట్ చేసిన వివరాలను ప్రజావేదిక ముందు ఉంచారు. ప్రతి పంచాయతీలోని ఉపాధి హామీ పథకంలో లోపాలు గుర్తించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డుమా పిడి పూర్ణిమదేవి మాట్లాడుతూ గబ్బడ గ్రామపంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ విధులకు సరిగా హాజరు కాకపోవడం ఈరోజు సోషల్ ఆడిట్ కూడా హాజరు కాకపోవడంపై ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా రెండు లక్షల 80000 జాబ్ కార్డులు ఉండగా నాలుగు లక్షల 43000 మంది డైలీ ఏం చేస్తున్నారని అన్నారు. వీరందరికీ వందరోజు పని దినాలు కల్పించడం ధ్యేయంగా పనిచేస్తున్నామని అన్నారు. అనకాపల్లి జిల్లా 96% లక్ష్మీ చేరుతుందని అన్నారు. వంద రోజులు పని దినాలు ముగించిన వారు 28 వేల మంది ఉన్నారని అన్నారు. ఉపాధి కూలీలతో కనీస వేతముగా 300 వచ్చే విధంగా చేస్తున్నామని అన్నారు. ప్రతి రైతు ఫారం ఫాండ్ నిర్మించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉషశ్రీ, ఎస్ ఆర్ పి నాగరాజు, ఏపీవో నాని బాబు, ఎంపిటిసి బోలెం రాంప్రసాద్, తెలుగుదేశం పార్టీ ప్రెస్ శ్రీరంగస్వామి, ఉపాధి హామీ సిబ్బంది, వీఆర్పీలు, సోషల్ ఆడిట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కల్కి వెంకటేశ్వర స్వామి వార్షిక కళ్యాణోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు

- నక్కపల్లి డిగ్రీ కాలేజ్ మైదానంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- 300 మంది పోలీసులతో బందోబస్తు : జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):- నక్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉపమాకలో శ్రీ కల్కి వెంకటేశ్వర స్వామి వార్షిక కళ్యాణోత్సవ మహోత్సవం మార్చి 9 నుండి 17 వరకు జరుగనున్న సందర్భంగా భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, కళ్యాణోత్సవానికి తొమ్మిది రోజుల పాటు సుమారు లక్ష మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నామని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో 300 మంది పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేయడంతో పాటు భద్రతను సెక్టార్లుగా విభజించి పర్యవేక్షించనున్నట్లు వివరించారు. భక్తుల సౌకర్యార్థం, భద్రత కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కళ్యాణ వేదిక, రథోత్సవ మార్గాలు, బంధురు సరస్సు పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లు,భక్తుల క్యూ లైన్లను సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు,మఫ్టీలో పోలీసుల మోహరింపు %-% గొలుసు దొంగతనాలు, జేబు దొంగతనాలు, ఈవ్ టీజింగ్ నియంత్రణ,రహదారిపై వ్యాపారాలను నిరోధించడం, ఆలయ మార్గంలో వాహనాల నిలిపివేత నివారణ,వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు ఏర్పాటు,సీసీ కెమెరాల ఏర్పాటు, నిరంతర మానిటరింగ్ కోసం తాత్కాలిక కంట్రోల్ రూం ఏర్పాటు,భక్తుల రద్దీ క్రమబద్ధీకరణకు డ్రోన్స్ వినియోగం,సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, క్యూ లైన్ల భద్రత కోసం బ్యారికేడ్ల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

**అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు**

మార్చి 10న నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ మైదానంలో జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర హోం మినిస్టర్ శ్రీమతి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరు కానున్న సందర్భంగా కాలేజ్ మైదానాన్ని జిల్లా ఎస్పీ పరిశీలించి, అధికారులకు తగిన సూచనలు అందించారు.ఈ కార్యక్రమాల్లో ఎస్.బి డిఎస్పీ బి.అప్పారావు, నర్సీపట్నం సబ్ డివిజన్ డిఎస్పీ పి.శ్రీనివాసరావు, నక్కపల్లి ఇన్‌స్పెక్టర్ కె.కుమార్ స్వామి, నక్కపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎల్.రామకృష్ణ, ఐటీ కోర్ ఎస్ఐ సురేష్ బాబు, ఆలయ ఈవో, కమిటీ సభ్యులు, ఇతర పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):- మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ శాసనసభ గౌరవ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గారి సతీమణి శ్రీమతి చింతకాయల పద్మావతి విశిష్ట అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "నేడు స్త్రీలు అన్ని రంగాల్లో ముందున్నారు. విద్య, ఉద్యోగాలు, వ్యాపారం, రాజకీయాల్లో మహిళలు తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారు.కృషి, పట్టుదలతో ముందుకెళితే ఏ లక్ష్యమైనా సాధించవచ్చు. విద్యార్థినులు తమ కలలను సాకారం చేసుకునేందుకు నిరంతరం కృషి చేయాలి" అని సూచించారు. సమాజంలో లింగ సమానత్వం కోసం అందరూ కృషి చేయాలి. మహిళలు పురుషులతో సమానంగా అన్ని హక్కులు పొందేలా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి అని అన్నారు.కళాశాల విద్యార్థులకు ఉపయోగపడేలా వెండింగ్ మిషన్, బర్నింగ్ మిషన్ అందజేస్తానని ఆమె ప్రకటించారు. అంతేకాకుండా, నూతనంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ ఆడియో సిస్టమ్‌ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో నర్సీపట్నం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీమతి రేవతమ్మ గారు మాట్లాడుతూ, "బయటి ప్రపంచంలో, ముఖ్యంగా పని ప్రదేశాల్లో మహిళలు ఎంతో జాగ్రత్తగా ఉండాలి. స్వీయరక్షణకు సంబంధించి అవగాహన పెంచుకోవాలి" అని విద్యార్థులకు సూచించారు.

నర్సీపట్నం గైనకాలజిస్ట్ డాక్టర్ పి.వందన మాట్లాడుతూ, "స్త్రీలు ఆత్మస్థైర్యంతో జీవించాలి. ఆరోగ్య పరంగా కూడా జాగ్రత్తలు తీసుకోవాలి" అని తెలిపారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రాజు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.ఎస్. కృష్ణ కళాశాలలో విద్యార్థినులకు అందుబాటులో ఉన్న సౌకర్యాల గురించి వివరించారు.ఈ సందర్భంగా విద్యార్థినులకు ఆటల పోటీలు, వ్యాసరచన పోటీలు, రంగవల్లుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ ర్యాలీ

పాల్గొన్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ఏపీటీడీసీ డైరెక్టర్ కిల్లు వెంకట రమేష్ నాయుడు



జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):- జి మాడుగుల మండల కేంద్రంలో ఐసిడిఎస్. సిడి పీవో జి . సువర్ణ కుమారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ముఖ్య అతిథులుగా ఏపీ టీడీసీ డైరెక్టర్ కిల్లు వెంకట రమేష్ నాయుడు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ర్యాలీలో పాల్గొన్న మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. నేడు సమాజంలో మహిళలు ప్రత్యేకమైన గుర్తింపు ఉందని, అన్ని రంగాల్లో కూడా మహిళలకు ప్రత్యేకమైన స్థానం కేటాయించిందని దీనిని వినియోగించుకొని ముందుకు రావాలని తెలిపారు. ఉద్యోగ లక్ష్య సాధన తో పాటు రాజకీయ రంగాల్లో కూడా మహిళలకు ముందుకు రావాలని ఈ సందర్భంగా తెలిపారు. అలాగే నేడు రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ప్రత్యేకమైన గుర్తింపు ఇచ్చిందని దీనిలో భాగంగా ఇటీవల కాలంలో ఆశ వర్కర్ల పనితీరును గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం పదవి విరమణ అనంతరం గ్రాడ్యుటీ తీసుకొచ్చినట్లు తెలిపారు. మండల అంగన్వాడి టీచర్స్ ప్రెసిడెంట్ జి మోదకొండమ్మ అంగన్వాడి టీచర్స్ యొక్క పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం శిశు సంక్షేమ శాఖ విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తుందని త్వరితగతిన సమస్యలు తీర్చడానికి కూటమి ప్రభుత్వం ముందుంటుందని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు సోమేలి చిట్టిబాబు, మాజీ ఎంపిటిసి కోట లక్ష్మణరావు, రాజు అధికార ప్రతినిధి దళాయి ఈశ్వరరావు , సాగేని. ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించి, వేతనాలు పెంచాలి




అచ్యుతాపురం, (విశాఖ సమాచారమ్):- గామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈరోజు అచ్చుతాపురంలో ర్యాలీ, ఎంపీడీవో ఆఫీస్ దగ్గర ధర్నా నిర్వహించి ఎంపీడీవో కి వినతిపత్రం అందజేశారు .ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ .రాము, మండల కార్యదర్శి కే .సోమునాయుడు మాట్లాడుతూ 25 సంవత్సరాలు పైబడి ఎండకు ఎండి వానకు తడిసి గ్రామపంచాయతీ కార్మికులుగా పనిచేస్తున్న కార్మికులకు పని ఎక్కువ జీతం తక్కువ గా ఉంది . చాలీచాలని జీతాలు చెల్లిస్తున్నారు దీంతో వీరి ఆరోగ్యాలను పణంగా పెట్టి ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం నెలకు పదిహేను వేల రూపాయలు ఇవ్వాలని బకాయి జీతాలు చెల్లించి గుర్తింపు కార్డులు ,ఈఎస్ఐ, పిఎఫ్ ,సెలవులు వంటి సౌకర్యాలు కల్పించాలని, దిబ్బపాలెం పంచాయతీ కార్మికులకు ఆదివారం సెలవు ఇవ్వాలని ,రిటైర్ అయిన వారికి గ్రాడ్యుటి ,పింఛన్ సౌకర్యం కల్పించాలని పనిలో ప్రమాదాలు జరిగితే ప్రభుత్వం లేదా పంచాయతీ వైద్య సేవ లు అందించి, గ్లౌజులు ,బూట్లు, మాస్కులు, నూనె ,సబ్బులు ,పనిముట్లు నాణ్యమైనవి సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల కన్వీనర్ ఆడారి. నాగేశ్వరరావు ,నాగమణి, శ్రీరాములు, రమణ, జ్యోతి,కల్యాణి మండలంలో వివిధ గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## భగవద్గీత ప్రేరణతో 'సమయ నిర్వహణ' పై సదస్సు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- గాయత్రి కళాశాల, రుషికొండలో మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎమ్‌బీఏ) విద్యార్థులకు "భగవద్గీత ప్రేరణతో సమయ నిర్వహణ" అనే అంశంపై ఒక ప్రేరణాత్మక సదస్సు నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని అంతర్జాతీయ కృష్ణభవనామృత సంఘం (ఇస్కాన్), సాగర్ నగర్ కు చెందిన ప్రముఖ సభ్యుడు హెచ్ హెచ్. కలాకాంత దాస్ (ఫ్లోరిడా, యుఎస్ఏ) గారు ముఖ్య అతిథిగా విచ్చేశారు.

కార్యక్రమం ప్రారంభంలో ఆచార్య కె ఎస్. బోస్ ప్రిన్సిపాల్, గాయత్రి విద్యా పరిషత్ ప్రారంభ వ్యాఖ్యలు చేశారు. తమ వ్యాఖ్యానంలో సమయ నియంత్రణ ప్రాముఖ్యతను తెలియజేశారు. ఆచార్య ఎమ్మెస్సార్. శేషగిరి ఎమ్‌బీఏ విభాగాధిపతి, తమ వ్యాఖ్యానంలో సమయ నియంత్రణ వృత్తిపరమైన మరియు వ్యక్తిగత జీవితాల్లో ఎంతటి ముఖ్యమైనదో విద్యార్థులకు వివరించారు.

సదస్సు సందర్భంగా శ్రీ కలాకాంత దాస్ గారు భగవద్గీతలోని ముఖ్యమైన శ్లోకాలను ప్రస్తావిస్తూ ధర్మం, కర్మ యోగం మరియు సమయ నిర్వహణకు అనుసరించాల్సిన ప్రయోజనకరమైన విధానాలను వివరించారు. ముఖ్యంగా లక్ష్యాలు నిర్ధారించడం, పని-వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత సాధించడం, ఆలస్యాన్ని నివారించడం వంటి విషయాలపై తన విలువైన సూచనలు అందించారు.

విద్యార్థులు ప్రాధాన్యత క్రమపద్ధతి, స్వీయ క్రమశిక్షణ, మరియు ఆలస్యపు అలవాటును అధిగమించడం వంటి అంశాలపై జరిగిన చర్చల్లో చురుగ్గా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమం శ్రీ పీ.వెంకట్ కృష్ణ గారి డైరెక్టర్ (ఐ.ఐ.పి.సి) వందన సమర్పణతో ముగిసింది.

సదస్సు ముగిసిన తర్వాత, ఇస్కాన్, సాగర్ నగర్ కేంద్రం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసానికి ఉపయోగపడే భగవద్గీత పుస్తకాలను అందజేసింది.

## జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

### జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

పాడేరు, (విశాఖ సమాచారమ్):- జిల్లా విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీలో ఐదుగురు ఎస్సీ, ఎస్టీ నాన్ ఆఫీసియల్ మెంబర్ల నియామకానికి, ముగ్గురు స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న నాన్ ఎస్ సి, ఎస్ టి కులాల వారిని నియామకానికి శరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కమిటి నందు సభ్యులుగా దరఖాస్తు చేసుకొను వారు అల్లూరి సీతారామ రాజు జిల్లా వాసులై ఉండాలని, సంబందిత ఆధారాలు (ఫోటోలు/పత్రములతో సహా) తో వారి పూర్తి బయోడేటాతో జతపరచి జిల్లా షెడ్యూల్డ్ కుల సంక్షేమ మరియు సాధికారిత అధికారి, అల్లూరి సీతారామ రాజు జిల్లా వారికి ఈ నెల 17వ తేదీలోగా సమర్పి%శీ%చాలని కలెక్టర్ వివరించారు. ఇతర వివరాలకు 8985868068, 7036408143 మొబైల్ నంబర్లలో ఉ: 10 గంటలు నుండి 5 గంటలు మధ్య సంప్రదించాలని సూచించారు.

# ఆమె లేనిదే ఇంట్లో క్షణమైన గడుస్తుందా !

(నేడు "అంతర్జాతీయ మహిళా దినోత్సవం" సందర్భంగా)



సృష్టిలో సగం ఆమె. అతివయే సంతాన లక్ష్మి. ఇంటి గడపకు పసుపు పారాణి, అకుపచ్చ మామిడి తోరణం ఆమె. సంసార సంద్రంలో ఆమె ఒక నిర్మల అల. నవ్వులు పంచే త్యాగమయి. ఆర్థికాభివృద్ధికి ఐశ్వర్య లక్ష్మి. గృహ కోవెలలో కొలువైన దేవత. ఆమె లేనిదే ఇంట్లో క్షణమైన గడవదు. గళం విప్పకుండా అవిశ్రాంతంగా శ్రమ చేసే పని మనిషి ఆమె. ఆకాశమంత ఓపిక, భూదేవి అంత సహనం ఆమె స్వంతం. ఆమె కుటుంబ సంక్షేమ నిధి. మగాడి గుండె సవ్వడి. ఆమె లేనిదే అన్నం ముద్ద దిగదు. ఆమె అలిగితే గృహమంతా అంధకారం. మహిళ మహిమాన్విత శక్తి రూపిణి. అష్ట లక్ష్ముల నిలువెత్తు రూపం అతివ. పురుషాధిక్య సమాజానికి తల్లి వేరు పడతి. అందరి శ్రేయస్సు కోరే ఆది లక్ష్మి. పట్టుదలకు ఆమె ప్రతిరూపం. సహనశీల మహిళ గృహసీమకు సంతోషాల హరివిల్లు. అన్నీ తానై ఇంటిని నడిపించే అతివ చుట్టూ అన్నీ ముళ్ల కంచెలే. ఇల్లే స్వర్గం అయిన వనితకు వంటిల్లు నిర్భంధ కారాగారం. ఆమె జీవితం కష్టనష్టాలు నిండిన దుఃఖ సాగరం. లింగ వివక్ష కోరల్లో చిక్కుకున్న మహిళ సమస్యల సుడిగుండంలో అనాదిగా కొట్టుమిట్టాడుతూనే ఉంటున్నది.

**లింగ సమానత్వం, సాధికారతలకు పట్టం కడదాం:**

ప్రపంచ మహిళ ఎదుర్కొంటున్న సమస్యలు ఎన్నో, సవాళ్లు మరెన్నో. లింగ వివక్ష, గృహ హింస. వరకట్న దురాచారం, బాల్య (బాలికల) వివాహాలు, లైంగిక వేధింపులు, మానభంగ పర్వాలు, అవిద్య, అనారోగ్యం, పోషకాహార లోపం, వృత్తి ప్రదేశంలో వేధింపులు, ఆర్థిక అసమానతలు, రాజకీయ రంగంలో అసమానతలు, మీడియాల్లో ఆమె అశ్లీల వస్తువు, ఆడ శిశువు వద్దంటూ భ్రూణ హత్యలు, కుటుంబం/ సమాజంలో ద్వితీయ శ్రేణి పాత్ర, పురుషాధిక్య సమాజంలో నలుగుతున్న ప్రాణి, కొరవడిన ఆర్థిక స్వేచ్ఛ, సామాజిక కట్టుబాట్లలో మగ్గుతున్న బక్క జీవి, ఉద్యోగ ఉపాధుల్లో వెనుకబాటు లాంటి పలు సవాళ్లను ఎదుర్కొంటున్న మహిళ నేడు గోరంత అభివృద్ధిని సాధించినా ఇంకా కొండంత సాధించాల్సి ఉన్నది. ప్రపంచ మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను గుర్తించిన పౌర సమాజం 1909 నుంచే "జాతీయ మహిళా దినం" పాటిస్తున్నప్పటికీ 1975 నుంచి ఐరాస నేతృత్వంలో "అంతర్జాతీయ మహిళా దినోత్సవం(ఇంటర్నేషనల్ వుమెన్స్ డే)" నిర్వహించుట జరుగుతున్నది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం-2025 ఇతివృత్తంగా "అందరు మహిళలు & బాలికలకు కల్పించాలి హక్కులు, సమానత్వం, సాధికారత" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం కొనసాగుతున్నది.

**గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్-2024 జాబితాలో 129వ స్థానం:**

నిత్య జీవితంలో మహిళల పాత్రను గుర్తిస్తూ వారికి పురుషులతో సమానంగా అవకాశాలను కల్పించడం, ఉన్నత విద్యలో వారికి పెద్ద పీట వేయడం, ఆమె ఆరోగ్య పరిరక్షణకు ఊతం ఇవ్వడం, ప్రపంచాభివృద్ధిలో ఆమెను భాగం చేయడం, ఆమె మాటకు విలువ ఇవ్వడం, అన్ని రంగాల్లో ఆమె చేతికి నాయకత్వ పగ్గాలు అందించడం, ఉద్యోగ ఉపాధుల్లో చేయూత ఇవ్వడం, లింగ వివక్షకు దూరంగా సమానత్వ బీజాలు నాటి పెంచి పోషించడం నిరంతరం వేగంగా జరగాలి. ఆమెలో దాగిన అపార శక్తిని సుస్థిరాభివృద్ధికి వినియోగించాలి. 'గ్లోబల్ జెండర్ గ్యాప్-2024' నివేదిక ప్రకారం 146 దేశాల జాబితాలో భారత్ స్థానం 129 ఉండడం విచారకరం. భారత్‌లో 39 శాతం మహిళలు సెకండరీ విద్యను పూర్తి చేయడం, శ్రామిక లోకంలో 27.2 శాతం మహిళలు మాత్రమే ఉండడం బాధాకరం, ఆక్షేపణీయం.

అమ్మ కారణంగా జన్మించిన పురుషుడు ఆమెను విస్మరిస్తే పుట్టగతులు ఉండవు. మహిళలో మహాలక్ష్మిని దర్శిస్తూ, స్త్రీలో ఐశ్వర్యాన్ని చూస్తూ, అమ్మతనానికి తలవంచి నమస్కరిద్దాం, ఆమెను పువ్వుల్లో పెట్టుకొని చూసుకుందాం. ఆమెలో సరస్వతి, లక్ష్మి, దుర్గలను దర్శిస్తూ సదా అతివకు అనంత అవకాశాలను అందిద్దాం. మహిళలకు సమాన హక్కులు కల్పించాల్సిన కనీస కర్తవ్యం పురుష పుంగవుల మీదనే ఆధారపడి ఉందని గమనించి ఆ దిశగా వడివడిగా అడుగులు వేద్దాం, ఆమెకు సముచిత స్థానం కల్పిద్దాం.

# సర్పంచ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**రావికమతం, (విశాఖ సమాచారమ్):-** మండలంలో కవగుంట గ్రామంలో సర్పంచ్ దాసరి సూర్య కుమారి వరహాలు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర పుష్పగిరి ఆసుపత్రి వారి సౌజన్యంతో కవగుంట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి 40 మంది రోగులు హాజరయ్యారు.వీరికి కంటి వైద్య నిపుణులు డాక్టర్ వై.నాయుడు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 8 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని, మరొక 9 మందికి కంటి అద్దాలు అవసరం అన్నారు. అయితే ఆపరేషన్ అవసరమయ్యే వారందరినీ వెంకటేశ్వర పుష్పగిరి ఆసుపత్రికి తరలించి శస్త్ర చికిత్స చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మనిషి అవయవాలన్నిటిలోనూ కన్ను చాలా ముఖ్యమైనదని దానిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందని సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు అన్నారు. రెండు నెలలకు ఒక మారు అయినా కంటిని చెకప్ చేయించుకోవాలన్నారు. అదేవిధంగా బైకుల మీద దూర ప్రాంతాలకు ప్రయాణం చేసేటప్పుడు కంటిలో ధూళి, దుమ్ము, ఇసుక పడకుండా కంటి అద్దాలను ధరించాలన్నారు. టీవీలు చూసేటప్పుడు తగిన దూరాన్ని పాటించాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కంటి జబ్బులు ఎక్కువగా సంభవిస్తున్నాయని అన్నారు. మనిషికి కంటి



చూపు లేకపోతే బయట ప్రపంచం ఏది మనకు తెలియదన్నారు . మనిషికి కంటి చూపు, వినికిడి లేకపోతే మనిషి ఎందుకు ఉన్నామో, ఎందుకు బ్రతుకుతున్నామో తెలియని పరిస్థితి ఏర్పడుతుందన్నారు . కొంతమందికి దగ్గర చూపు లేకపోవడం, మరి కొంతమందికి దూరంగా చూపు ఉండకపోవడం, మరి కొంతమందికి కంటి చూపు పూర్తిగా లేకపోవడం, మరి కొంతమందికి కంటి ద్వారా నీరు కారటం తదితర సమస్యలతో అనేకమంది బాధపడుతుంటారన్నారు. అందువలన మనలాంటి పల్లె గ్రామాలలో ఇటువంటి సమస్యలను ఎదుర్కొంటున్న ప్రతి ఒక్కరికి ఉచితంగా వైద్యం అందించాలన్న ఉద్దేశంతో ఈ ఆసుపత్రి వైద్యులు ముందుకు రావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# పరవాడ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ తుహిన్ సిన్హా

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పరవాడ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నిబంధనలకు అనుగుణంగా నిర్వహణ పాటించాలని అధికారులకు సూచించారు.పెండింగ్‌లో ఉన్న కేసుల సీడీ ఫైళ్లను సమీక్షించి, వాటి పురోగతిపై సమగ్రంగా పరిశీలించారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, గంజాయి వినియోగదారుల వివరాలను సేకరించి వారిపై నిఘా పెట్టాలని ఆదేశించారు.చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎన్ఫోర్స్మెంట్ కేసులు నమోదు చేయాలని సూచించారు. రౌడీషీటర్లు, చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తులను కౌన్సిలింగ్ చేయడంతో పాటు, వారి ప్రస్తుత కార్యకలాపాలపై నిఘా పెట్టాలని పేర్కొన్నారు.నేరాల నివారణకు గస్తీ చర్యలను మరింత పటిష్టంగా అమలు చేయాలని, ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందితో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



పరిశ్రమలలో జరిగే ప్రమాదాల పట్ల పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, స్థానిక పోలీసులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు (మహిళా పోలీస్‌లు)తో కలిసి స్కూళ్లు, కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మహిళా చట్టాలు, పోక్సో యాక్ట్, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్స్, రోడ్డు భద్రత వంటి అంశాలపై విద్యార్థులకు, మహిళలకు అవగాహన కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ వి.విష్ణు స్వరూప్, పరవాడ ఇన్‌స్పెక్టర్ ఆర్.మల్లికార్జున రావు, ఎస్సైలు కృష్ణారావు, మహాలక్ష్మి మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# సినిమా

## 'రక్త్ బ్రహ్మాండ్'లో 'మీర్జాపూర్' నటుడు.. ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నట్లు వెల్లడి



ప్రస్తుతం యాక్షన్ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సిరీస్ 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్'. సూపర్‌హిట్ సిరీస్‌లతో ఆకట్టుకునే దర్శకద్వయం రాజ్, డీకే దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో ఆదిత్యరాయ్ కపూర్, సమంతతో పాటు కీలకపాత్రలో అలీ ఫజల్ కూడా నటిస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో అలీ ఈ సిరీస్ గురించి మాట్లాడారు.

దీనికోసం తాను మార్షల్ ఆర్ట్స్, వెయిట్ లిఫ్టింగ్‌లలో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నట్లు అలీ వెల్లడించారు. తన పాత్రలో ఫిట్‌గా కనిపించడం కోసం నిరంతరం కష్టపడుతున్నట్లు చెప్పారు. రోజుకు 7 గంటలు వ్యాయామం చేస్తున్నట్లు తెలిపారు. 'లుక్ కోసం జుట్టు పెంచుకుంటున్నా. అన్నిటికంటే పెద్ద సవాలు నా శరీరాన్ని, మనసును శక్తికి మించి కష్టపెడుతున్నా. మీర్జాపూర్ కోసం శిక్షణ తీసుకున్న ట్రైనర్ దగ్గరే ఇప్పుడు కూడా ట్రైనింగ్ తీసుకుంటున్నా. ఇప్పటివరకూ చేసిన అన్ని ప్రాజెక్ట్‌ల కంటే రక్త్ బ్రహ్మండ్ భిన్నమైనది. ఇది ప్రేక్షకులకు కచ్చితంగా థ్రిల్ పంచుతుంది' అని అలీ వివరించారు.

రాజ్, డీకే, మరో దర్శకుడు అనిల్ బార్వే కలిసి పనిచేస్తున్న యాక్షన్ ఫాంటసీ వెబ్‌సిరీస్ 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్'. ఇటీవల ఈ సిరీస్ షూటింగ్ ఆగిపోయిందనే వార్తలు రాగా దర్శకులు వాటిని ఖండిస్తూ పరోక్షంగా స్పందించారు. సెట్స్‌లో దిగిన పలు ఫొటోలు పంచుకుంటూ తమ ప్రాజెక్టులు ఆగిపోలేదని స్పష్టం చేశారు. తమ పని తాము గొప్పగా చేసుకుంటూ వెళ్తున్నామని పేర్కొన్నారు.

## ఖుష్ అవుతోన్న పెద్దోడు- చిన్నోడు ఫ్యాన్స్.. వీడియోలు చూశారా



2013లో థియేటర్‌లలో విడుదలై ట్రెండ్ సెట్ చేసింది 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు'. పెద్దోడు పాత్రలో వెంకటేశ్, చిన్నోడిగా మహేశ్ బాబు ఎప్పటికీ గుర్తుండిపోయేలా నటించారు. అంజలి, సమంత వారి నటనతో అందరనీ ఆకట్టుకున్నారు. దాదాపు 12 ఏళ్ల తర్వాత ఈ హిట్ మూవీ మరోసారి బాక్సాఫీసు ముందుకు వచ్చింది. నేడు (మార్చి 7) రీ రిలీజై సందడి చేస్తోంది. దీంతో ఈ ఇద్దరు స్టార్ హీరోల ఫ్యాన్స్ తెగ ఖుష్ అవుతున్నారు.

కథ, కథనంతో పాటు ఇందులో పాటలు, డైలాగులు కూడా సోషల్ మీడియాలో ఇప్పటికీ షేర్ అవుతూనే ఉన్నాయి. తాజాగా థియేటర్‌లలోకి వచ్చిన ఈ సినిమా వీడియోలు కూడా ఎక్స్‌లో తెగ వైరల్‌గా మారాయి. విజయవాడలోని ఓ థియేటర్‌లో ఈ సినిమాలోని పెళ్లి సీన్‌ను రీ క్రియేట్ చేశారు. ఎన్ని సినిమాలు వచ్చినా ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో పోటీకి రావంటూ కామెంట్స్ పెడుతున్నారు. ఆ వీడియోలను నిర్మాణసంస్థ షేర్ చేసి అభిమానులకు కృతజ్ఞతలు చెప్పింది.

## అంజలి ప్రేమలో సిద్ధు



కిరణ్ అబ్బవరం, రుక్సర్ థిల్లాన్ జంటగా నటించిన చిత్రం 'దిల్‌రూబా'. నాజియా డేవిసన్ మరో కథానాయిక. విశ్వ కరుణ్ దర్శకత్వం వహించారు. సారెగమ సంస్థతో కలిసి రవి, జోజో జోస్, రాకేశ్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 14న రానుంది. ఈ సందర్భంగా గురువారం రాత్రి ట్రైలర్ విడుదల కార్యక్రమం జరిగింది. అంజలి, సిద్ధు ప్రేమ చుట్టూ సాగే కథతో ఈ చిత్రం రూపొందిందని ట్రైలర్ చాటుతోంది. ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ "ప్రేమలో ఉన్నవాళ్లు కలిసి చూడాల్సిన చిత్రమిది అన్నారు". కథానాయిక రుక్సర్ థిల్లాన్ మాట్లాడుతూ "నిజాయతీ, ధైర్యం ఉన్న అంజలి అనే యువతిగా నేను కనిపిస్తా" అన్నారు. తాను పోషించిన పాత్ర గురించి చెబుతూనే, వేదికపై తనకు ఎదురైన ఓ అనుభవం గురించి అసహనం వ్యక్తం చేశారు రుక్సర్. "వేదికలపై అసౌకర్యంగా ఉన్నప్పుడు, ఫొటోలు వద్దని ప్రేమతో చెప్పినా వినకుండా తీస్తూ సామాజిక మాధ్యమాల్లో పెడుతుంటారు. వాళ్లు ఎవరో నేను పేర్లు చెప్పను. ఆ విషయం, ఈ సమాచారం చేరాలనే నేను మాట్లాడుతున్నా" అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.

## నయనతార తొలిసారి



ఖుష్బూ, నయనతార, మీనా, రెజీనా

తన సినిమాల ప్రారంభోత్సవాల్లో... ప్రచార కార్యక్రమాల్లో నయనతార కనిపించరు. అలాంటిది ఈసారి అందరినీ ఆశ్చర్య పరుస్తూ ఆమె సినిమా ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. నయనతార ప్రధాన పాత్రధారిగా... సుందర్.సి దర్శకత్వంలో 'మూకుతి అమ్మన్ 2' రూపొందుతోంది. విజయవంతమైన 'మూకుతి అమ్మన్'కి కొనసాగింపుగా రూపొందుతున్న చిత్రమిది. తొలి చిత్రం తెలుగులో 'అమ్మోరు తల్లి'గా అనువాదమై ఆదరణ పొందింది. కొనసాగింపు చిత్రాన్ని ఐవీ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థతోకలిసి డా.ఇషారి కె.గణేశ్‌నిర్మిస్తున్నారు. ఇందులో సుందర్.సితో పాటు, దునియా విజయ్, రెజీనా, యోగిబాబు, ఊర్వశి, అభినయ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. రూ. కోటితో నిర్మించిన భారీ సెట్‌లో పూజా కార్యక్రమాలతో సినిమా ప్రారంభమైంది. సినీ ప్రముఖులు మీనా, ఖుష్బూ, సునీల్ నారంగ్, జగదీశ్, సి.కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



## ఒడిశాలో మహేశ్ సందడి

కథానాయకుడు మహేశ్‌బాబు ఒడిశాలోని కొరాపుట్ జిల్లాలో సందడి చేశారు. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ హీరోగా తెరకెక్కుతోన్న ఎస్-ఎస్ఎంబీ-29 చిత్రీకరణ కోసం బుధవారం ఇక్కడికి చేరుకున్నారు. అనంతరం దేవ్‌మాలి పర్వతంపై బస చేసే ప్రాంతానికి వెళ్లారు. ఆయనతోపాటు మలయాళ కథానాయకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ఉన్నారు. ఈ చిత్రంలో పృథ్వీరాజ్ నటిస్తున్నారని వస్తున్న వార్తలు ఈ సెట్లోకి ఆయన చేరుకోవడంతో నిజమయ్యాయి. ఈ నెల 28 వరకు తోలోమాలి, దేవ్‌మాలి, మాచ్‌ఖండ్ ప్రాంతాల్లోని ఎంపిక చేసిన లోకేషన్లలో చిత్రీకరణ జరగనున్నట్లు సినీవర్గాలు తెలిపాయి. తోలోమాలి పర్వతంపై ఇప్పటికే ప్రత్యేక సెట్‌ను వేశారు. కొద్ది రోజుల్లో మిగతా నటీనటులు ఇక్కడికి చేరుకోనున్నారు.

## మహిళా దినోత్సవ వారోత్సవాల్లో కలెక్టర్



**పార్వతీపురం/సాలూరు, (విశాఖ సమాచారమ్):-** అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో జిల్లా ప్రధాన కేంద్రంలో జరిగిన ర్యాలీకి జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం జరిగిన 2 కె రన్ స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టరేట్ వరకు కొనసాగిన 2 కె రన్ ర్యాలీలో కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం మానవహారం చేపట్టి అధికారులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించిన కలెక్టర్ మరియు మహిళల పట్ల గౌరవంతో మెలగాలని, బలమైన భావి సమాజం కోసం మహిళలు ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడిఎ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి డా. టి. కనకదుర్గ, జిల్లా విద్యాశాఖాధికారి డా. ఎస్.తిరుపతి నాయుడు,వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి డా. టి. జగన్మోహనరావు, ఇతర జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అనకాపల్లి జిల్లాలో రెవెన్యూ ప్రక్షాళన ఎప్పుడో ?

● మొక్కుబడిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక.. ● అర్జీలపై మండలాలు వారీగా ఒక్క సమీక్ష నిర్వహణ శూన్యం ● పిజిఆర్ఎస్‌లో అనకాపల్లి జిల్లా అధమం గా ఉందని సీఎం వ్యాఖ్య ● అధికారులకు చీమ కుట్టినట్లు అయిన లేదు.. ● అనకాపల్లి తహసీల్దారు కార్యాలయంలో ఓ అధికారి అక్రమాలపై బహిరంగ సమావేశాల్లో ఆధారాలతో దండెత్తిన టీడీపీ నాయకులు.. ● మండలాల్లో జోరుగా కొనసాగుతున్న భూ దందాలు... ● మూడు పువ్వులు ఆరు కాయలుగా భూముల కబ్జాలు, దొంగ పట్టాలు జారీ, గ్రావెల్, మట్టి, ఇసుకల అక్రమ తరలింపు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ ప్రతినిధి):-** అనకాపల్లి జిల్లా రెవెన్యూ శాఖ లోని అవినీతి, అక్రమాలు విధుల పట్ల నిర్లక్ష్యం, జవాబుదారీతనం లేకపోవడం వంటి జాడ్యాలను వదల గొట్టేందుకు అనకాపల్లి జిల్లా కలెక్టర్ పునుకొని రెవెన్యూ శాఖ లో ప్రక్షాళన చేపట్టాలని ప్రజా సంఘాలు గోసిస్తున్నాయి. మొక్కుబడి హెచ్చరికలు, చూసి చూడనట్లు వదిలేయడం, సూపర్ ఎమ్మెల్యే లకు అవినీతి రాంబందుల్లా తయారైన అధికారులకు ప్రాధాన్యం ఇవ్వడం కొనసాగితే పాలనకు గట్టి దెబ్బ తగులుతుందని వస్తున్న విమర్శలను జిల్లా కలెక్టర్ పట్టించుకొపోతే రెవెన్యూ శాఖ పూర్తి గా దిగజారి పోతుంది. ప్రభుత్వం మారినా మండలాల్లో భూ దందా కొనసాగుతూనే వుంది. అనకాపల్లి తాలూకా ఆఫీస్ లో ఓ అధికారి రాజకీయ అండదండలతో ఉన్నతాధికారుల ఉదాసీనత తో రికార్డ్స్ ను మార్చేస్తున్నారు. కబ్జా దారులకు భూములను దోచి పెడుతున్నారు. లాండ్ పూలింగ్ అక్రమాలు, ఇళ్ళ స్థలాలు, భూముల కబ్జాలు, దొంగ పట్టాలు జారీ, గ్రావెల్, మట్టి, ఇసుకల అక్రమ తరలింపు మూడు పువ్వులు ఆరు కాయలు గా కొనసాగుతుందని బహిరంగ గా పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కలెక్టరేట్ లో పిజిఆర్ఎస్ ద్వారా కలెక్టర్ కి మొరపెట్టుకున్న అర్జీదారులు కాళ్ళు అరిగేలా తిరుగుతున్నారు. ఈ అర్జీలు పరిష్కారం పై తహశీల్దార్ల తో జెసి సమీక్షలు చేయడం లేదు. పిజిఆర్ఎస్ లో అనకాపల్లి జిల్లా అధమం గా ఉందని సీఎం వ్యాఖ్యానించిన జిల్లా అధికారులకు చీమ కుట్టినట్లు అయిన లేదు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఒక మొక్కుబడిగా కొనసాగుతుంది తప్ప ప్రతి వారం కలెక్టర్ హెచ్చరికలే తప్ప అర్జీ దారుల గోడు పట్టించుకోలేదని విమర్శలు ఉన్నాయి. అర్జీలపై మండలాలు వారీగా ఒక్క సమీక్ష నిర్వహించడం లేదు. అర్జీల డేటా కలెక్షన్ కే పాలన పరిమితం అయ్యింది. మండల రెవెన్యూ కార్యాలయాలకు జెసి సందర్శించరని రాష్ట్ర భూ పాలనాధికారికి పలు పిర్యాదులు కూడా వెళ్లాయి అయిన రెవెన్యూ అర్జీలకు కనీసం రశీదు లైనా ఇవ్వాలంటూ ఆదివాసీ సంఘాలు ర్యాలీలు నిర్వహించవలసి వచ్చింది. గ్రీవియెన్స్ అర్జీల్లో చిన్న, చిన్న సమస్యలకు సమాధానం దొరకడం లేదు. గడువు ముగిసినా అతిగతి ఉండదు. అర్జీ దారులు పదేపదే కలెక్టరేట్ కు కాళ్లరిగేలా తిరగవలసి వస్తోంది. దారుణమైన ఈ పరిస్థితిని కలెక్టర్, జెసిలు నివారించాలి. అర్జీల పరిష్కారం ద్వారా భూ కుంభకోణాలు నివారించవచ్చు. అనకాపల్లి తహసీల్దారు కార్యాలయంలో ఓ అధికారి అక్రమాలపై తెలుగుదేశం నాయకులు బహిరంగ సమావేశంలో ఆధారాలతో సహ దండెత్తారు. కలెక్టర్ తిరిగి ఆ అధికారికి పెద్ద పీట వేస్తున్నారు. తహసీల్దారు నిబద్ధతకల అధికారి కావడంతో పరిస్థితి కొంత అదుపులో ఉంది.

వైసీపీ హయాంలో మంత్రి బూడి

చెప్పినట్టు ఆడి చెలరేగిన ఇద్దరు తహశీల్దార్ల ను కూటమి ప్రభుత్వం కలెక్టరేట్ లో కీలక స్థానాల్లో నియమించింది.


అనకాపల్లి మండలం పిసినికాడ శివారు బిఆర్టీ కాలనీ లో రెవెన్యూ సర్వే నెంబరు 362-5, 6లో సుమారు మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని ఒక వ్యక్తి ఆక్రమించుకున్నాడని బిఆర్టి కాలనీ ప్రజలు రెవన్యూ అధికారులకు పలుమార్లు పిర్యాదులు చేసారు. రెండు ఏళ్ల నుండి అలుపెరుగని పోరాటం చేస్తున్నా ఆక్రమించుకున్న భూమిని ఇంత వరకు స్వాధీనం చేసుకోకపోవడం పట్ల పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆక్రమణ దారుడుకి రెవెన్యూ అధికారి ఒకరు అండగా ఉంటున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కలెక్టర్ ఇటీవల అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రిలో డాక్టర్ల అవినీతి భాగోతంపై దృష్టి పెట్టి వారి ఆట కట్టించే ప్రయత్నం చేసారు. అక్కడ డాక్టర్ ఒకరిని సస్పెండ్ చేసారు. మీడియాలో వచ్చిన కథనం ఆధారంగా కలెక్టర్ స్పందించిన తీరు ఆమెకు మంచి పేరు తెచ్చి పెట్టడమే కాక ఇష్టం రాజ్యంగా వ్యవహరించే అధికారులు, ఉద్యోగులుకు చెమటలు పట్టించాయి. కలెక్టర్ ఇదే చొరవ తన రెవెన్యూ శాఖ విషయం లో చూపితే రైతుల సమస్యలు తీరుతాయని ప్రజా సంఘాలు అభిప్రాయ పడుతున్నాయి.

ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా సేకరించిన సమాచారం లో అనకాపల్లి జిల్లా రెవెన్యూ అవినీతి బయటపడింది. దీంతో వెబెక్స్ సమావేశం నిర్వహించి కలెక్టర్ రెవెన్యూ సర్వే ఉద్యోగులను హెచ్చరించారు.

కలెక్టర్ ఇంతటి తో సరిపెడితే ప్రభుత్వానికి చెడ్డపేరు తప్పదు. లంచ గొండి అధికారులు కోసం ప్రజలను పాలనను గాలికి వొదేలే స్తారా అని వివిధ సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

## దేశంలోనే అతిపెద్ద రోప్ వే కేంద్రం ఆమోదం




**ఉత్తరాఖండ్, (విశాఖ సమాచారమ్):-** చార్ధామ్ యాత్రలో కీలకమైన కేదార్నాథ్ కు వెళ్లేందుకు భక్తులకు ప్రయాణ కష్టాలు తప్పనున్నాయి. సోన్ ప్రయాగ్ నుంచి కేదార్నాథ్ వరకు రూ.4,081 కోట్లతో రోప్ వే నిర్మించేందుకు పీఎం మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 12.9కి.మీ. మేర రోప్వే వల్ల ఓ వైపునకు 8-9 గంటలు పట్టే ప్రయాణ సమయం కేవలం 36నిమిషాలకు తగ్గిపోనుంది. రోప్ వే నిర్మాణంలో ట్రై కేబుల్ డిటాచబుల్ గొండోలా టెక్నాలజీ (3%వా%) ఉపయోగించనున్నారు.

## ఐసీడీఎస్ పీఓ, సూపర్వైజర్‌ను సస్పెండ్ చేయాలి




**కే. కోటపాడు, (విశాఖ సమాచారమ్):-** మండలం లోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసు వద్ద సీఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పోతన వలస గ్రామం అంగన్వాడి టీచర్ ఆర్.నూకరత్నం ఆత్మహత్య ప్రయత్నానికి పాల్పడినందుకు ప్రాజెక్ట్ ఈవో అధికారి మంగతాయారు మరియు సూపర్వైజర్ రాములమ్మ లను వెంటనే సస్పెండ్ చేయాలని, టీచర్లపై వేధింపులు ఆపాలని, వ్యక్తిగత దూషములకు లకు దిగరాదని, సెంటర్లు విసిట్ టు భాగంగా ఏమైనా తప్పులు ఉంటే సరిదిద్దుకోవాలని కాగితం ప్రకారం నోటీసు ఇవ్వాలి, టీచర్లు వేతనాలు ఆపరాదు, మానసికంగా ఇబ్బంది పెట్టరాదు అందువలన ఆత్మహత్య ప్రయత్నానికి పాల్పడిన అధికారులపై శాఖ పరమైన చర్యలు చేపట్టాలని సిఐటియు జిల్లా ఉపాధ్య క్షులు గని శెట్టి సత్యనారాయణ సత్యనారాయణ, మండలప్రజా సంఘాల కన్వీనర్ ఎర్ర దేవుడు మరియు సిఐటియు మండల కార్యదర్శి ఇల్లి నాయుడు బాబు ప్రాజెక్టు కార్యదర్శి పి.భవాని అంగన్వాడి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి కుమారి, ప్రాజెక్ట్ నాయకులు కోమలి,అమ్మాజీ, ఈశ్వరమ్మ, తులసి, అంగన్వాడి కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు, అనంతరం సీఐకి ఇవ్వడం జరిగింది విచారణ చేపట్టి అంగన్వాడీ టీచర్లకు న్యాయం చేయాలని కోరారు.

## గంజాయి సాగు, సారా తయారీ వద్దు, మన ఆరోగ్యమే ముద్దు : ఎక్సైజ్ సీఐ ఆచారి



**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** నాటు సారా తయారు చేయవద్దు ప్రజల ఆరోగ్యాన్ని పాడు చేయ వద్దంటూ పాడేరు ఎక్సైజ్ సీఐ టి వి ఎస్ ఎన్ ఆచారి కోరారు. జి.మాడుగుల మండలం బీ రం.బో ్రతాడి గ్రామాలలో నాటు సారా తయారీ వద్దంటూ దానివల్ల జరిగే అనర్థాలు ఏమిటో బుర్రకథ రూపంలో ఆయా గ్రామాలలో కల జాతర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు ప్రజా భవన్‌లో అన్ని పార్టీల ఎంపీల సమావేశం

**హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం వద్ద తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ లో ఉన్న సమస్యల పరిష్కారానికి అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. భట్టి విక్రమార్క మల్లు, ఉప ముఖ్యమంత్రి (ఆర్థిక, ప్రణాళిక శాఖ) అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు ప్రజాభవన్ లో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం వద్ద అపరిష్కృతంగా ఉన్న రాష్ట్రానికి సంబంధించిన వివిధ సమస్య లపై చర్చించనున్నారు. పెండింగ్లో ఉన్న సమస్యలపై ఎంపీలు రాష్ట్రం పక్షాన పార్లమెంట్ లో, కేంద్ర ప్రభుత్వం వద్ద మాట్లాడాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రయత్నం చేస్తుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతున్నారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ల తో పాటు రాష్ట్రానికి సంబంధించిన ఎంపీలందరిని శుక్రవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్వయంగా ఫోన్ చేసి సమావేశానికి ఆహ్వానించారు.






## రీ సర్వే, ఈ పంట ప్రక్రియల పరిశీలన



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ శుక్రవారం ఆనందపురం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. గొట్టిపల్లిలో శుక్రవారం పర్యటించిన ఆయన అక్కడ జరుగుతున్న రీ-సర్వే, ఈ-పంట ప్రక్రియలను పరిశీలించారు. రీ-సర్వే ప్రక్రియను పరిశీలించి అక్కడ అధికారులకు, సిబ్బందికి తగిన సూచనలు జారీ చేశారు. రైతులకు ఇబ్బంది లేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని సూచించారు. డ్రోన్, రోవర్ ద్వారా రీసర్వే జరిగిన తీరును సునిశితంగా పరిశీలించారు. సర్వే పూర్తి అయిన తర్వాత గ్రామసభ నిర్వహించాలని, పూర్తి వివరాలను రైతుల ముందు ఉంచాలని అధికారులను ఆదేశించారు. రైతుల వినతులను, ఇతర అంశాలను దృష్టిలో ఉంచుకొని అన్ని రకాల చర్యలు చేపట్టాలన్నారు. ఈ క్రమంలో స్థానిక రైతులతో కలెక్టర్ కాసేపు వివిధ అంశాలపై మాట్లాడారు. రీ-సర్వే, ఇతర సేవలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

**గ్రామ సచివాలయం, పీహెచ్సీ ఆకస్మిక తనిఖీ**

మండల పర్యటనలో భాగంగా గొట్టిపల్లి గ్రామ సచివాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవలపై సిబ్బందిని ఆరా తీశారు. పలు నివేదికలను, సిబ్బంది హాజరు పట్టీలను పరిశీలించిన ఆయన సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన సేవలను వేగంగా అందించాలన్నారు. సచివాలయాలకు వచ్చే ప్రజలకు అన్ని విధాలుగా సహకారం అందించాలని ఉపదేశించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. ప్రజలకు వైద్యపరమైన సేవలను మెరుగైన రీతిలో అందించాలని సూచించారు.

సర్వే విభాగం ఏడీ సూర్యారావు, ఆనందపురం తహశీల్దార్ శ్యామ్ ప్రసాద్, ఎంపీడీవో, సర్వే, వ్యవసాయ, రెవెన్యూ శాఖ సిబ్బంది తదితరులు పర్యటనలో ఉన్నారు.


VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123
Hyderabad (Sai Ganesh) : Cell : 9030841841, Parawada (satyanarayana): Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Office (Raghunath) : 7013785256, Arilova (D.Venkatesh) : 94937 77970.
Maddilapalem (G.Raamakrishna) : 99084 24231, Anakapalli (M.Krishna Rao) : 63023 75539, Chintapalli (Srinivas) : 94923 40861.
Bheemunipatnam (B.Appalareddy) : 98662 78981, Srikakulam (Ramarao) : 70321 98574, Pithaapuram (staalin) : 94912 23264,


గమనిక : ఇక్కడ ఇవ్వబడిన పేర్లు కలిగిన వారిని మాత్రమే విశాఖ సమాచారమ్ దినపత్రికకు విలేఖరులుగా గుర్తించవలెను. ఇక్కడ పేరు లేకుండా ఎవరైనా విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా చెబితే నమ్మవద్దు.